


ప్రభుత్వ భోజనంబు...ఇవాళ నాకెముందు అంటూ విద్యార్థులు మధ్యాహ్న భోజనం ఇష్టపడి మరీ తింటున్నారు. సన్నబియ్యం అన్నం, రుచికరమైన కూరలతో పాటు ప్రతిరోజూ గుడ్డు పెడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో లావు బియ్యంతో చేసిన అన్నం సరిగా ఉడికేది కాదు... అన్నం కూడా ముద్దగా ఉండేది. కడుపు నిండా అన్నం తినలేని పరిస్థితుల్లో విద్యార్థులు ఏదో కొంత తిని వదిలేసేవారు. కొందరు ఇంటి నుంచి బాక్సుల్లో అన్నం తెచ్చుకునేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం పెడుతుండటంతో విద్యార్థులు ఇష్టంగా తింటున్నారు.



ఆరోగ్యకరమైన జీవనానికి ఆయుధం యోగ

● హార్సిలీహిల్స్ యోగాంధ్రలో కలెక్టర్ శ్రీధర్

బి.కొత్తకోట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన జీవనం సాగించేందుకు యోగ ముఖ్యమైన ఆయుధమని, యోగా ద్వారా శారీరక, మానసిక ఆధ్యాత్మిక పరిణితిని సాధించవచ్చని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో గురువారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు యోగాసనాలు వేశారు. కలెక్టర్ మాట్లాడుతూ 1000 మందితో హార్సిలీహిల్స్‌లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈనెల 21న రాయచోటిలో 5 వేల మందితో ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహిస్తామన్నారు. అదేరోజున విశాఖలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో 5 లక్షల మంది యాగాంధ్రలో పాల్గొనబోతున్నారని, అదే స్ఫూర్తితో జిల్లాలోని అన్ని మండల, గ్రామ పంచాయతీ కేంద్రాల్లో యోగా నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా బి.కొత్తకోటకు చెందిన విద్యార్థి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వెలుగు మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు సుమారు 1000 మంది వరకు హాజరై యోగాంధ్ర కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. కలెక్టర్ మండల అధికారులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి నాగభూషణం, డీఆర్డీఏ పీడీ సత్యనారాయణ, తహసీల్దార్ బావాజాన్, ఎంపీడీవో క్రిష్ణవేణి, కమిషనర్ జీవీ పల్లవి, ఏపీఎం రాజేశ్వరి, ఆర్ఐ రామాంజనేయులు, అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



హార్సిలీహిల్స్‌లో యోగా చేస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

ప్రభుత్వ భోజనంబు...

● సన్నబియ్యం... రుచికరం...
● ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో నాణ్యమైన భోజనం
● ఇష్టపడి మరీ తింటున్న విద్యార్థులు

ములకలచెరువు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మధ్యాహ్న భోజనంలో లావు బియ్యంతో అన్నం వండేవారు. దీంతో పాటు అన్నంలో ఎక్కువగా పురుగులు వస్తుండేవి. ఆ భోజనం తినలేక విద్యార్థులు ముఖం ఇబ్బందులు పడేవారు. ఇదంతా నిన్నటి మాట....ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చొరవతో ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో సన్న బియ్యంతో భోజనం వండుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం నూతన విద్యా విధానం తీసుకొచ్చి సన్న బియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. దీంతో ప్రస్తుతం విద్యార్థులు కడుపు నిండా భోజనం తింటున్నారు. ఇంటి భోజనం లాగే ఉందని ఆనందపడుతున్నారు. ములకలచెరువులోని జడ్పీ హైస్కూల్‌లో గురువారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించగా సన్నబియ్యంతో చేసిన వెజిటబుల్ రైస్, కూర, కోడిగుడ్డును విద్యార్థులు ఎంతో ఇష్టంగా తిన్నారు. 300 మంది విద్యార్థులు అందరూ కలిసి భోజనం తిని చాలా బాగుందని చెప్పారు.



ములకలచెరువు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది



ములకలచెరువు జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

తంబళ్లపల్లె నియోజకవర్గంలో 20 వేల మంది విద్యార్థులు

ప్రభుత్వం సన్నబియ్యంతో భోజన పథకాన్ని జిల్లా అంతటా అమలు చేస్తోంది. ముఖ్యంగా మారుమూల ప్రాంతమైన తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దమండ్యం, కురబలకోట, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, తంబళ్లపల్లె మండలాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమం వసతి గృహాల్లో 20 వేల మందికిపైగా విద్యార్థులు సన్న బియ్యంతో భోజనం తింటున్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా సన్న బియ్యంతో విద్యార్థులకు భోజనం అందిస్తున్నారు.

క్యూఆర్ కోడ్ ట్యాగ్‌తో సన్న బియ్యం సరఫరా

ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు సరఫరా చేసే సన్న బియ్యం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంది. ప్రతి బియ్యం బస్తాకు క్యూఆర్ కోడ్‌తో జియో ట్యాగ్‌లను ఏర్పాటు చేసింది. పాఠశాలలు, హాస్టళ్లకు చేరే ప్రతి బస్తాను స్కాన్ చేసి ఉన్నతాధికారులకు పంపే విధంగా ఏర్పాటు చేసింది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఎక్కడి నుంచి ఎక్కడికి సరఫరా అయిందో తదితర అంశాలు తెలుసుకోవచ్చు. గతంలో లాగా 50 కేజీల బస్తా కాకుండా ప్రస్తుతం 25 కేజీల బస్తా సరఫరా చేస్తున్నారు.

ఆహార పట్టిక

సోమవారం - సన్న బియ్యంతో అన్నం, కూరగాయల కూర, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కీ
మంగళవారం - సన్న బియ్యంతో పులగం లేదా పులిహోర, పల్లి చట్నీ, కోడిగుడ్డు ఫ్రై, రాగి జావ
బుధవారం - సన్న బియ్యంతో అన్నం, సాంబారు, ఉడికించిన కోడి గుడ్డు, చిక్కీ
గురువారం- వెజిటబుల్ రైస్, ఉడికించిన కోడి గుడ్డు, కూర, రాగి జావా
శుక్రవారం - సన్న బియ్యంతో అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కీ
శనివారం - సన్నబియ్యంతో అన్నం, కందిపప్పు చారు, బెల్లం పొంగళి, రాగిజావా



సన్న బియ్యంతో వండిన అన్నం

ఇంటి భోజనం లాగే ఉంది



స్కూల్‌లో భోజనం అచ్చు ఇంటి భోజనం లాగే ఉంది. ఒకసారి తిని మళ్లీ కొంచెం పెట్టించుకుంటున్నాను. విద్యార్థులందరం ఇక్కడే భోజనం తింటున్నాము. ఇంతకు మునుపు లావు బియ్యంతో అన్నం చేస్తుండడంతో తినేదానికి అయ్యేది కాదు. ఇప్పుడు సన్న బియ్యంతో అన్నం వండుతుండడంతో ఎంతో బాగుంది.

- వెన్నెల, విద్యార్థి, జడ్పీ హైస్కూల్, ములకలచెరువు

గతంలో ముద్దగా ఉండేది



సన్న బియ్యంతో భోజనం రుచికరంగా ఉంటోంది. కడుపు నిండా తింటున్నాం. గతంలో ముద్దగా ఉండడంతో తినలేకపోయాం. కడుపు మాడ్చుకోలేక కొంత తిని ఇంటికి వెళ్లి మళ్లీ తినేవాడిని. ప్రస్తుతం సన్నబియ్యంతో భోజనం వండుతుండడతో ఇష్టంగా తింటున్నాను. ప్రతిరోజూ నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నారు.

-రఫి, విద్యార్థి, జడ్పీ హైస్కూల్, ములకలచెరువు

విద్యార్థులు ఇష్టంగా తింటున్నారు



ప్రభుత్వం డొక్కా సీతమ్మ పథకం కింద ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో సన్న బయ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తుండడంతో విద్యార్థులు ఎంతో ఇష్టంగా తింటున్నారు. ప్రతిరోజూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేస్తున్నాను. భోజనం ఎలా ఉంది అని అడగక ముందే విద్యార్థులే ముందుగా చాలా బాగుందని చెబుతున్నారు.

- వెంకటరమణ, ఎంఈవో, ములకలచెరువు

ప్రభుత్వ బడిలో చేరండి..

● ఉత్తమ విద్యను అందిస్తాం
● ఇంటింటికీ ఉపాధ్యాయులు

సంబేపల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడిలో చేరండి.. నాణ్యమైన విద్యను అందిస్తాం అంటూ పాలెంగడ్డ, పాపన్నగారిపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం గురువారం గ్రామంలో తిరిగి విద్యార్థుల నమోదు సేకరణ చేపట్టారు. పాలెంగడ్డ హరిజనవాడ, పాపన్నగారిపల్లెలోని విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలతో పాటు సమదుస్తులు, అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యాబోధనలు కల్పిస్తామని తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ఒప్పించారు. కార్పొరేట్ పాఠ శాల కన్నా దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యను విద్యార్థులకు అందిస్తామన్నారు. బడిమానేసి బడికి దూరంగా ఉన్న పిల్లలను కూడా బడిలో చేర్పించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రెడ్డెప్పరెడ్డి, ఉపాధ్యాయులు నల్లమల రామాంజులు, అన్నయ్య, శ్రీకాంత్, ఎంపీటీసీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

'తల్లికి వందనం' సద్వినియోగం చేసుకోండి

● ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చదువుకుంటున్న పిల్లలందరికీ ఎలాంటి పరిమితులు లేకుండా తల్లికి వందనం నిధులను జమ చేస్తోందని, ఆ డబ్బును విద్యార్థుల పైచదువుల కోసం సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి చెప్పారు. గురువారం స్థానిక బీసీ బాలికల గురుకుల పాఠశాలలో దాదాపు 500 మంది విద్యార్థినులకు విద్యా మిత్ర కిట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థికంగా సతమవుతున్నా తల్లికి వందనం అమలు చేయడం సాహసమైన చర్య అన్నారు. విద్యాశాఖలో ప్రక్షాళనకు విద్యా శాఖ మంత్రి లోకేశ్ సవాలుగా తీసుకున్నారని దాని ప్రభావంతో పలు సంస్కరణలు ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. గతంలో రాజకీయ నాయకుల ఫొటోలు వేసుకుని విద్యార్థులకు కిట్‌లు అందజేశారని, ప్రస్తుతం విద్యావేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో ఇవి అందజేస్తున్నట్లు చెప్పారు. స్థానిక గురుకుల పాఠశాలలో భోజనం నాణ్యత గురించి విద్యార్థులను అడగ్గా వారు చాలా బాగుందని చెప్పడంతో ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక గురుకుల పాఠశాలకు అనుబంధంగా కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో కరీముల్లా, ప్రిన్సిపాల్ సోమశేఖర్, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప రెడ్డి, రాజంపేట ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ఏఎంసీ చైర్‌పర్సన్ మాలతి, డైరెక్టర్ వర్మ, మాజీ ఎంపీపీ నాగభూషణ రెడ్డి, నాయకులు యోగేష్ రెడ్డి, కేవీ రెడ్డి, సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గురుకుల బాలికలకు విద్యా మిత్ర కిట్‌లు అందజేస్తున్న కిశోర్‌కుమార్ రెడ్డి

మోకాళ్లపై అర్ధనగ్న ప్రదర్శన

● 22 నుంచి సమ్మె ఉధృతం చేస్తాం ● కాంట్రాక్టు కార్మికుల ప్రకటన



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికులు

మదనపల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మె గురువారానికి 16వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేస్తున్న ఈ సమ్మెలో భాగంగా కార్మికులు మోకాళ్లపై కూర్చుని అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఏమీ పట్టనట్లు ఉందని కార్మికుల జేఏసీ నాయకుడు ఎం.ఎస్.కన్నయ్య తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, టెక్నికల్ సిబ్బందికి రూ.29,200, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతనం తక్కువగా ఉన్నా తమను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ, ప్రభుత్వ పథకాలు అందకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేకుంటే 22వ తేదీ నుంచి సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెలో ఎస్.కె.రెడ్డెప్ప, నాగరాజు, బాబు, గోపాలకృష్ణ, మహేష్‌బాబు, ఎస్.ముజుబుల్ రెహ్మాన్, లైటింగ్ కుమార్, నీళ్ల బాలకృష్ణ, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవో నెంబర్-5 రద్దు చేయండి

● సచివాలయ ఉద్యోగుల డిమాండ్

మదనపల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల బదిలీలు, రేషనలైజేషన్‌కు సంబంధిన జీవో నెంబర్-5ను రద్దు చేయాలని వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు గురువారం వారు నిరసన తెలియచేశారు. జీవోతో సొంత మండలం, మున్సిపాలిటీలలో ఉద్యోగం చేయకూడదనే నిబంధన ఉందని, దీనివలన ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులు ఎదురు కానున్నట్లు వారు పేర్కొన్నారు. దీన్ని రద్దు చేయడమో, లేక సవరించడం ద్వారానో మండలం, మున్సిపాలిటీలలో పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషనలైజేషన్ ప్రక్రియ తర్వాత మిగిలిన ఉద్యోగులను ఎక్కడ నియమిస్తారో స్పష్టత ఇచ్చిన తర్వాతనే బదిలీలు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ కె.ప్రమీలకు అందజేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి నాగరాజు, శరత్‌కుమార్‌రెడ్డి, యూనియన్ నాయకులు అభిషేక్ వినోద్ కుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి, రాజారెడ్డి, హేమలత, నందిని, ఆనంద్, మునుస్వామి, హరి, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

కలెక్టర్‌ను అభినందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణపై కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను, జిల్లా యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు అభినందించారు. 21న నిర్వహించబోయే యోగాంధ్ర కార్యక్రమంపై గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమంపై కలెక్టర్లకు తగు సూచనలు చేశారు. యోగా కార్యక్రమంలో భాగంగా నెలవారీగా ఇచ్చిన శిక్షణలు, యోగా ట్రైనర్లకు అందించిన సర్టిఫికెట్ల తదితర అంశాల్లో అన్నమయ్య జిల్లా మొదటి స్థానంలో ఉన్నందున కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు.

జడ్జి అవ్వాలన్నది నా కల

లాసెట్ ఫస్ట్ ర్యాంకర్ గిరీష్మ

పీలేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'మా నాన్న లాయర్ కావడంతో చిన్నప్పటి నుంచి లాయర్, ఆ తరువాత జడ్జి అవ్వాలన్నది నా కల. అందులో భాగంగానే ఇంటర్‌లో సీఈసీ తీసుకుని లాసెట్ రాశాను. మంచి ర్యాంకు వస్తుందని ఊహించాను కానీ ఏకంగా స్టేట్ ఫస్టు ర్యాంకు రావడం సంతోషంగా ఉంది' అంటూ తన సంతోషాన్ని వ్యక్తం చేసింది గిరీష్మ. లాసెట్-2025 (ఐదేళ్ల) ప్రవేశ పరీక్షలో 107 మార్కులతో రాష్ట్ర మొదటి ర్యాంకు సాధించిన గిరీష్మ తండ్రి పల్లపు జయశేఖర్ పీలేరులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. తల్లి బి.హేమలత ముడుపులవేముల పంచాయతీ రాయలవారిపల్లెలోని వీవో-1కు సంఘమిత్రగా పనిచేస్తున్నారు. కాగా గిరీష్మ పీలేరులోని నారాయణ విద్యాసంస్థలో పదో తరగతి, పీలేరులోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుకుంది. కాగా మూడేళ్ల లాసెట్‌లో రాయచోటికి చెందిన వి.రమేశ్ రాష్ట్రస్థాయి మూడో ర్యాంకు, ఐదేళ్ల లాసెట్‌లో మదనపల్లెకు చెందిన యు.వెంకట రమణ 6వ ర్యాంకు సాధించారు.



గిరీష్మకు కేక్ తినిపిస్తున్న తండ్రి జయశేఖర్

పీజీలో లోకేశ్వరికి రెండో ర్యాంకు



ఒంటిమిట్ట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్టకు చెందిన యనమల లోకేశ్వరి ఎల్ఎల్ఎం లాసెట్‌లో రాష్ట్ర రెండో ర్యాంకును సాధించింది. గురువారం పీజీ లా సెట్ ఫలితాలను ప్రకటించారు. ఈ ఫలితాల్లో లోకేశ్వరి రాష్ట్రంలో రెండో ర్యాంకును సాధించింది. లోకేశ్వరి తండ్రి వెంకటరమణ, తల్లి సుధామణిలు సంతోషం వ్యక్తం చేశారు.

నాటుసారా తయారీని రూపుమాపాలి

● నవోదయం-2 పథకంపై అవగాహన కల్పించండి
● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్

మదనపల్లె టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె, ములకలచెరువు, వాల్మీకిపురం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గ్రామాలు, అటవీ సమీప గ్రామాల్లో నాటుసారా తయారీని పూర్తిగా రూపుమాపాలని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ తెలిపారు. గురువారం స్థానిక ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్‌తో కలసి సీఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ మదనపల్లె, ములకలచెరువు, వాల్మీకిపురం, పీలేరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాటుసారా క్రైం రేటు ఎక్కువగా ఉందని, అధికారులు, సిబ్బం ది ప్రతిరోజూ ఆయా గ్రామాలను పరిశీలించి నాటుసారా తయారీని అరికట్టాలన్నారు. నవోదయం-2 పథకం కింద ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి నాటుసారా తయారీకి దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆషామాషీగా విధులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈఎస్ మధుసూదన్ మాట్లాడుతూ జిల్లాలో 70 గ్రామాల్లో నాటుసారా తయారవుతోందని గుర్తించామని, ఇప్పటి వరకు 42 గ్రామాల్లో నిర్మూలించామన్నారు. మదనపల్లె, పీలే రు సర్కిళ్లలో 36 గ్రామాలకు గాను 26 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దారని, వాల్మీకిపురం, ములకలచెరవు సర్కిళ్లు వెనుకబడ్డాయన్నారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐలు నాటుసారా తయారీ కేంద్రాలపై దాడు లు నిర్వహించాలన్నారు. అనంతరం ఈఎస్ విలేకర్లతో మాట్లాడుతూ మదనపల్లె డివిజన్‌లో నాలుగు నెలల్లో 184 నాటుసారా కేసులు నమోదు చేసి 144 మంది ని అరెస్టు చేశామన్నారు. 1047 లీటర్ల నాటుసారాతో పాటు ఏడు ద్విచక్రవాహనాలు సీజ్ చేశామన్నారు. తహసీల్దార్‌ల ఎదుట 450 మందిని బైండోవర్ చేయగా, అందులో నిబంధనలు ఉల్లంఘించిన 35 మందికి రూ.1.90 లక్షల జరిమానా విధించామన్నారు. సమావేశంలో ఏఈఎస్ వై.జోగేంద్ర, కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ రవి, ఎక్సైజ్ సీఐలు భీమలింగ, సుబ్బారెడ్డి, లత, మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో ఎక్సైజ్ డీసీ జయరాజ్, ఈఎస్ మధుసూదన్

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసంపై విచారణ


అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

పీలేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం గర్నిమిట్ట పంచాయతీ మల్లారపు వాండ్లపల్లె నల్లగుట్ట క్రాసు హౌసింగ్ కాలనీలో ఉన్న డా.బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఏపీ ఎంఆర్పీఎస్ నాయకులు గురువారం ఉదయం ఆ ఘటనపై కలెక్టర్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించారు. ఆయన ఆదేశాలతో కలకడ ఇన్‌చార్జ్ సీఐ ప్రసాద్‌బాబు, తహసీల్దారు నరేంద్రకుమార్, ఎస్ఐ చిన్నరెడ్డప్ప సంఘటనా స్థలాన్ని పరిశీలించి దెబ్బతిన్న అంబేడ్కర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేశారు. ఈ సంఘటనపై కేవీపల్లెకు చెందిన ఏపీఎంఆర్పీఎస్ నేత ముల్లంగి చంద్రయ్య మాట్లాడుతూ నల్లగుట్ట వద్ద గత ప్రభుత్వ హయాంలో దళితులకు హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేశారని, ఆ సమయంలోనే తాము అక్కడ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కాగా కొందరు అగ్రవర్ణాల వారు కాలనీ, అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకున్నారని ఆయన తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ, తహసీల్దారు మాట్లాడుతూ తగిన విచారణ జరిపి, నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షిస్తామని దళిత సంఘ నాయకులకు హామీ ఇచ్చారు.

యోగాంధ్రకు సిద్ధంగా ఉండాలి: కలెక్టర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాయచోటిలో జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21న యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు తదితర అధికారులతో ఈ నెల 21న జిల్లా వ్యాప్తంగా నిర్వహించబోయే యోగాంధ్ర కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యోగాను ప్రజల జీవితంలో భాగస్వామ్యం చేసినప్పుడే యోగాంధ్ర కార్యక్రమం విజయవంతమైనట్లు అవుతుందన్నారు. నెల రోజులుగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణలో అన్నమయ్య జిల్లా మొదటి స్థానంలో ఉందని అధికారులు, సిబ్బంది వలనే ఈ విజయం సాధ్యమైందన్నారు. ఈ నెల 21న రాయచోటిలో 5 వేల మందితో దేవాంతర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

పల్లెపండుగ బకాయిలు రూ.86 కోట్లు

- ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులు
- అప్పులపాలైన టీడీపీ నాయకులు

మదనపల్లెటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో అభివృద్ధి పనులు చేపట్టండి... ఏజెన్సీల చేత పనులు చేయించే బాధ్యత పీఆర్ ఏఈలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులదే.. లక్ష్యాలను చేరుకోకుంటే జీతాలు నిలిపివేస్తాం అంటూ జిల్లా ఉన్నతాధికారులు మండలస్థాయి అధికారులను వెంటబడ్డారు. కింది స్థాయి అధికారులేమో టీడీపీ నాయకులను బతిమలాడి పల్లెపండుగ పనులు చేయించారు. ఇప్పుడు చూస్తే నాలుగు నెలలవుతున్నా చేసిన పనులకు బిల్లులు పడలేదు. అప్పులు చేసి కాంట్రాక్టు పనులు చేసిన టీడీపీ నాయకులు అధికారుల మీద పడుతున్నారు. వారేమో తప్పించుకుని తిరుగుతున్నారు. ఇదీ జిల్లా వ్యాప్తంగా పల్లెపండుగ కార్యక్రమంలో నిర్వహించిన పనులపై సుమారు రు.86 కోట్ల బకాయిల సంగతి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అన్నమయ్య జిల్లాకు పల్లెపండుగ కార్యక్రమానికి రూ.63 కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద సీసీ రోడ్లు, పశువులకు నీటి తొట్టెలు, మినీ గోకులాల నిర్మాణాలు చేపట్టారు. కేవలం ఏజెన్సీల చేత ఈ పనులు చేయించాలని చెప్పడంతో గ్రామాల్లో టీడీపీ నాయకులు చోటామోటా కాంట్రాక్టర్లుగా మారి అప్పులు చేసి నిర్మాణ పనులు చేపట్టారు. రైతులు వారి పొలాలు, ఇళ్ల వద్ద నీటితొట్టెలు, మినీ గోకులాలు నిర్మించుకున్నారు. మొదటి విడత కొంతమందికి బిల్లులు పడ్డాయి కానీ ఆ తర్వాత చాలామందికి పడలేదు. ఇక కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి సీసీ రోడ్ల పనులు చేసిన టీడీపీ నాయకులు చేసిన పనులకు బిల్లులు పడక అప్పుల పాలయ్యారు. ముఖ్యంగా గ్రామాల్లో అయితే వందల సంఖ్యలో టీడీపీ నాయకులు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. దీంతో మూడు నెలలుగా జిల్లాలో ఎక్కువ ప్రాంతాల్లో పల్లెపండుగ పనులు నిలిపివేశారు. కనీసం పార్టు బిల్లులు పడితేనే పనులు పూర్తి చేస్తామని టీడీపీ నాయకులు, ఏజెన్సీలు మొండికేసి కూర్చున్నారు.


రామసముద్రం మండలం వాల్మీశ్వరస్వామి కొండపై అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులు

తారురోడ్లకు రూ.50 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్‌కు రూ.36 కోట్ల బకాయిలు


మదనపల్లె మండలం వేంపల్లె మల్లయ్యకొండపై నిలిచిపోయిన రోడ్డు పనులు

జిల్లాలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల కింద పల్లెపండుగ కార్యక్రమంలో 1206 నీటితొట్లు మంజూరు కాగా వాటిలో 1171 నీటితొట్టెల నిర్మాణం పూర్తి చేశారు. 1240 మినీ గోకులాలు మంజూరు కాగా వాటిలో 1175 మినీ గోకులాల నిర్మాణాలు పూర్తి చేశారు. 842 సీసీ రోడ్లు మంజూరు కాగా 601 సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. వీటికి 2024-25 మార్చి వరకు రూ.35.16 కోట్ల బకాయిలు అలాగే ఉన్నాయి. ఇవి కాక ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే, జూన్ 10వ తేది వరకు చేసిన పనుల బిల్లులు వీటికి అదనం.

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో రూ.50 కోట్లు

జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో పల్లె పండుగ కార్యక్రమాల్లో తారు రోడ్లు, వెట్ మిక్సింగ్ రోడ్లు, కంకర రోడ్లు, పాఠశాలల ప్రహరిగోడల నిర్మాణాలు చేపట్టారు. జనవరిలో సంక్రాంతి వరకు కాంట్రాక్టర్లకు అంతో ఇంతో బిల్లులు పడ్డాయి. కానీ తర్వాత ఎక్కువశాతం పనులకు బిల్లులు పెండింగ్ పెట్టేశారు. ఉదాహరణకు మదనపల్లె నియోజక వర్గంలోని రామసముద్రం మండలం వాలీశ్వర స్వామి కొండపైకి రూ.2.06 కోట్లతో కొత్త రోడ్డు నిర్మాణం, మదనపల్లె మండలంలో వేంపల్లె మల్లయ్యకొండపైకి రూ.1.05 కోట్లతో కొత్త రోడ్డు నిర్మాణం ప్రారంభించారు. పెద్ద మొత్తంలో ఉన్న ఈ పనుల్లో టీడీపీ నాయకులు రోడ్డు ఫార్మేషన్‌కే ఎక్కువ ఖర్చు పెట్టారు. కానీ వారికి ఇంతవరకు బిల్లులు పడలేదు. దీంతో ఎక్కడ పనులు అక్కడే నిలిపివేశారు. ఇకపోతే గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేసి వాటిని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల చేత అట్టహాసంగా ప్రారంభింపజేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కానీ ఇంతవరకు వారికి బిల్లులు చెల్లించలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే టీడీపీ నాయకులు (కాంట్రాక్టర్లు) వారి బాధలు వర్ణణాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఈ నెలాఖరుకు బిల్లులు రావచ్చు

జిల్లాలో పల్లెపండుగ కార్యక్రమంలో ఎన్‌ఆర్ ఈజీఎస్, పీఆర్ ఆధ్వర్యంలో పనులు నిర్వహించాము. వీటిలో రూ.40 నుంచి 50 కోట్ల వరకు పీఆర్ శాఖ పనులకు బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. ఈనెలాఖరులోగా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయొచ్చు. ఆదేశాలు వచ్చిన వెంటనే అందరికీ బిల్లులు చెల్లిస్తాం.

- దయాకర్‌రెడ్డి, ఈఈ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, రాయచోటి


కోళ్లబైలు పంచాయతీ వన్నూర్‌సాబ్ గుట్టపై నిర్మించిన సీసీరోడ్డు

దాడిచేసిన డిజిటల్ అసిస్టెంట్‌పై కఠిన చర్యలు

- బాధిత కుటుంబానికి అన్ని విధాలా న్యాయం
- సచివాలయంలో ఘటనకు... ప్రభుత్వం తరపున సారీ..
- కలెక్టర్ చామకూరి శ్రీధర్

బి.కొత్తకోట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగి చేసిన పనికి ప్రభుత్వం తరపున సారీ.. మీ కుటుంబానికి అన్ని విధాలా న్యాయం చేస్తాం.. మీ రెండవ బిడ్డకు కూడా తల్లికివందనం నిధులు పడేలా చూస్తాం.. మిమ్మల్ని అవమానించి, గాయపరిచిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం.. జరిగిన ఘటనకు చింతిస్తున్నాం... అంటూ సాక్షాత్తూ కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆ కుటుంబాన్ని ఓదారుస్తూ హామీ నిచ్చారు.

బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం పంచాయతీ సచివాలయంలో బుధవారం జరిగిన ఘర్షణలో ఓ కుటుంబంపై స్థానిక డిజిటల్ అసిస్టెంట్ బాబా ఫకృద్దీన్ దాడి చేయడంతో ముగ్గురు వ్యక్తులు గాయపడి, కేసు నమోదైన విషయం తెలిసిందే. సమాచారం అందగానే ఘటనపై విచారణాధికారిగా మదనపల్లి సబ్‌కలెక్టర్‌ను నియమించి పూర్తి వివరాలను కలెక్టర్ తెప్పించుకున్నారు. గురువారం హార్సిలీహిల్స్ పర్యటనకు వచ్చిన నేపథ్యంలో గుమ్మసముద్రం ఘటన బాధితులను కలసి మాట్లాడేందుకు జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌లతో కలిసి గండువారిపల్లికి విచ్చేశారు. కలెక్టర్ హోదాలో సచివాలయంలో కూర్చుని ఘటనపై విచారణ చేసి, బాధితులను అక్కడికే రప్పించుకుంటారని అందరూ భావించారు. అయితే ఆయన గండువారిపల్లికి వెళ్లి బాధితుల నివాసంలో శంకరప్ప, అనురాధ, నాగభూషణంలతో నేరుగా మాట్లాడారు. జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగి దాడి చేసిన తీరును, తమకు జరిగిన అవమానాన్ని వివరిస్తూ శంకర, అనురాధలు కన్నీటి పర్యంతమయ్యారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ బాధితుల వైద్య ఖర్చులను స్వయంగా భరిస్తానని, పెండింగ్‌లో ఉన్న పక్కాగృహానికి రూ.70 వేలు అదనపు సాయం అందేలా చూస్తానని, తల్లికి వందనం నిధులు పడేలా చూస్తామన్నారు. మండలంలోని సచివాలయ ఉద్యోగులను సమావేశపరిచి పనుల నిమిత్తం వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మెలిగేలా కౌన్సెలింగ్ ఇవ్వాలని ఎంపీడీవో క్రిష్ణవేణిని ఆదేశించారు. అనంతరం గ్రామస్థులు పలు సమస్యలపై కలెక్టర్‌కు విన్నవించారు. తమ గ్రామంలో రీసర్వే సమయంలో జాయింట్ ఎల్పీఎం పెట్టడంతో 1బి రావడం లేదని, పలువురికి తల్లికివందనం నిధులు పడలేదని గ్రామస్థులు కలెక్టర్‌కు విన్నవించారు. ఈ నెల 25న గ్రామంలో గ్రామసభ నిర్వహించి, అర్జీలను తీసుకుంటామని రైతులకు సంబంధించిన అన్ని సమస్యలను తీరుస్తామని కలెక్టర్ హామీనిచ్చారు. కార్యక్రమంలో సీఐ జీవన్‌గంగనాథబాబు, ఎంపీడీవో క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


గుమ్మసముద్రం సచివాలయ ఘటనలో గాయపడిన వ్యక్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

సస్పెన్షన్ తొలగింపు

రాజంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గతంలో రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలపై అశ్రద్ధ వహించిన గత మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరర్‌రావు సస్పెన్షన్‌ను తొలగిస్తూ మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ రాజంపేటలో కమిషనర్‌గా నియమించారు. అయితే ప్రభుత్వం నిర్దేశించిన రెవెన్యూ రాబడి విషయంలోనూ, ఇంటింటి సర్వేలోనూ ఇతరత్ర మున్సిపాలిటీ నిర్దేశిత లక్ష్యాల్లోనూ నాగేశ్వరరావు అలసత్వం చూపుతున్నారని పేర్కొంటూ ఆయనను బదిలీ చేస్తూ సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా ప్రస్తుతం శ్రీనివాసులు పని చేస్తున్నారు. అయితే బదిలీపై వెళ్లి సస్పెన్షన్‌కు గురైన నాగేశ్వరరావు మరో పది నెలల్లో పదవి విరమణ వయస్సు పూర్తి కానందున తమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఉన్నతాధికారులను అభ్యర్థించారు. నాగేశ్వరరావు అభ్యర్థనను పరిశీలించిన ప్రభుత్వం సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ రెవెన్యూ రాబడి, ఇతర ప్రాధాన్యతలేని పోస్టులో నాగేశ్వరరావును కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయనపై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేస్తూ ప్రాధాన్యత లేని పోస్టులో త్వరలో ఆయనను నియమించనున్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తాం

- కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇచ్చిన ఇంజనీరింగ్ కార్మికులు


మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

రాయచోటిటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఈ నెల 22 నుంచి సమ్మెలోకి వెళతామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ అన్నారు. గురువారం ఆయన ఇంజనీరింగ్ కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ వాసుబాబుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు 15 సంవత్సరాల నుంచి జీతాలు పెంచకపోగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంజనీరింగ్ కార్మికులకు వర్తించవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అదేవిధంగా టెక్నికల్ వారికి రూ.29,200 జీతాలు ఇవ్వాలని, నాన్ టెక్నికల్ వారికి రూ.24,500 ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ ఆ జీవోలో వర్తింపజేయలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే జీతాలు పెంచకపోతే సమ్మెలోకి వెళతామని తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెక్షన్ అధ్యక్షుడు అక్బర్‌బాషా, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌రెడ్డి, రమణ, కమిటీ సభ్యులు రమణ, వెంకట్రమణ, దర్బార్ పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై త్రిసభ్య కమిటీ విచారణ


మృతికి గల కారణాలపై విచారణ చేస్తున్న అగ్రికల్చర్ ఏడీ నాగరాజు


తల్లి రాక కోసం ఎదురుచూస్తున్న చిన్నారులు

సిద్దవటం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతు దంపతులు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన తెలిసిందే. కాగా ఈ విషయంపై త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టింది. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని బద్వేల్ అగ్రికల్చర్ ఏడీ నాగరాజు గురు వారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాల విషయమై త్రిసభ్య కమిటీలో డీఎస్పీ, ఆర్డీవో, అగ్రికల్చర్ ఏడీ ముగ్గురు విచారించి నిర్ధారణ చేస్తామన్నారు. రైతు అప్పులు చేసిన ప్రామిసరి నోటీసు, బాండ్లు, పంట పొలాల ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే తగిన న్యాయం చేస్తామన్నారు. వీరి వెంట గ్రామస్థులు, వ్యవసాయశాఖ సిబ్బంది, మండల వీఆర్వో సంటయ్య, వీఆర్‌ఏ కిషోర్, ఎంపీటీసీ ప్రతినిధి శివశంకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

కాగా మృతుడి తండ్రి మునిరెడ్డి వారితో మాట్లాడుతూ తాము సొంత పొలంతో పాటు మరో ఐదు ఎకరాల్లో పంటలు సాగు చేసేవారమని, పంటల సాగుకు దాదాపు రూ.25 లక్షలు అప్పు చేసినట్లు తెలిపారు. వేరుశనగ, పసుపు, ఉల్లి, పట్టుపరిశ్రమ సాగు, పంటల్లో నష్టం రావడంతో మనస్థాపంతో తన కుమారుడు, కోడలు జూన్ 9న తిరుపతికి వెళుతున్నామని చెప్పి కడప వాచుపల్లె బస్టాండు వద్ద ఓ ఎరువుల దుకాణంలో రసాయనిక మందులు కొనుగోలు చేశారన్నారు. ఈ నెల 10న తిరుపతిలోని లాడ్జీలో పురుగుల మందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లగా వైద్యసేవల నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించామన్నారు. ఈ ఘటనలో కుమారుడు నాగేంద్రరెడ్డి (35) మృతి చెందగా, కోడలు పుష్పవేణి చికిత్స తీసుకుంటోందని తెలిపారు. కాగా మండలంలోని డేగనవారిపల్లె గ్రామంలో స్వగృహం వద్ద మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రి మృతితో పిల్లలు జి.లావణ్య, నాగేంద్ర దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు.

హమాలీల మధ్య ఘర్షణ

- రెండు కాలనీల్లో తీవ్ర ఉద్రిక్తత
- అదనపు బలగాలతో పోలీసు పికెట్‌లు ఏర్పాటు
- మూడు గంటలపాటు పోలీసు స్టేషన్ ముందు హంగామా
- నేడు మార్కెట్‌లో హమాలీలు ప్రవేశించకుండా పోలీసుల చర్యలు


దాడులకు పాల్పడకుండా అడ్డుగా నిలబడిన పోలీసులు

కలికిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులోని టమోట మార్కెట్‌లో హమాలీల మధ్య మొదలైన గొడవ తీవ్ర ఘర్షణగా మారి చివరకు రెండు కాలనీల మధ్య ఉద్రిక్తతకు దారి తీసింది. ఒక వైపు పోలీసులు ఉదయం నుంచి సర్దుబాటు చేస్తుండగా సయోధ్య కుదిరిందని ఊపిరి పీల్చుకున్న తరువాత సాయంత్రం 6 గంటల నుంచి మొత్తం వ్యవహారం రెండు వర్గాల మధ్య దాడులు, ప్రతి దాడులకు సిద్ధమైంది. వివరాలిలా... రెండు కాలనీలకు చెందిన దాదాపు 350 మంది ఏళ్ల తరబడి స్థానిక టమోట మార్కెట్‌లో హమాలీలుగా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం మార్కెట్‌లో టమోటాలను సర్దుబాటు చేసే ప్రయత్నంలో హమాలీ తీసుకొస్తున్న ఒక ఖాళీ బాక్సు జారి మరో హమాలీ కాలి మీద పడింది. దీంతో బాధితునికి ఆ హమాలీ క్షమాపణ చెప్పి తనపనిలో నిమగ్నమయ్యాడు. ఆ తరువాత కొంత సేపటికి బాధిత హమాలీ తరఫున నలుగురైదుగురు వచ్చి బాక్సు పడేసిన హమాలీపై దురుసుగా ప్రవర్తించారు. ఇది వాగ్వివాదంతో మొదలై చివరికి ఒకరినొకరు కొట్టుకునే వరకూ వెళ్లింది. ఈ దశలో పలువురు వ్యాపారులు జోక్యం చేసుకుని సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. పరిస్థితి శ్రుతి మించుతున్న సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే మార్కెట్‌కు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. ఇది మళ్లీ పునరావృతం కాకుండా చేసేందుకు తరువాత స్టేషనుకు రావాలని ఇరువర్గాలకు సూచించారు.

ఈ నేపథ్యంలో ఒక వర్గానికి చెందిన దాదాపు రెండు వందల మంది సాయంకాల స్టేషను వద్ద పోగయ్యారు. సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి వారిలో కొందరిని కూర్చోబెట్టి సర్దుబాటు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇది జరుగుతుండగానే మరో వర్గానికి చెందిన ఇంకో హమాలీ మార్కెట్ వైపు నుంచి క్రాస్ రోడ్డు వద్దకు వచ్చి కేకలు వేస్తూ చేతిలో కొడవలి చూపిస్తూ మోటారు సైకిల్‌పై పోలీసుస్టేషను చేరుకున్నాడు. అక్కడ కూడా తిరిగి కొడవలి చూపిస్తూ వీరంగం చేయడంతో అప్పటికే అక్కడున్న మరో వర్గం హమాలీలు రెచ్చిపోయారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కొడవలితో వచ్చిన వ్యక్తిని బంధించి స్టేషన్ లోపలికి తీసుకెళ్లారు. ఈ సంఘటనతో బయట వున్న వందల మంది హమాలీలు రెచ్చిపోయారు. ఇదిలా వుండగానే అంతా ఒక కొలిక్కి వస్తున్నదని, మరో వర్గం హమాలీలను కూడా పిలిపించాలని పోలీసులు ప్రయత్నిస్తుండగానే అక్కడున్న హమాలీలు మోటారు సైకిళ్లు తీసుకుని మరో వర్గం హమాలీలకు చెందిన కాలనీపై దాడికి ప్రయత్నించారు. సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వీరిని వెంబడిస్తూ కాలనీ పైకి పరుగులు తీశారు. మరో వైపు కాలనీ వాసుల్లో మహిళలు, వృద్ధులు, పిల్లలు రోడ్డు పైకి వచ్చి మరో వర్గం హమాలీల దాడులను ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారు. దాడులకు ప్రయత్నించిన హమాలీలను పోలీసులు చెదరగొట్టి తరిమేశారు.

పోలీసు సిబ్బంది బయట ప్రాంతాలకు బందోబస్తు డ్యూటీకి వెళ్లడంతో స్థానిక పోలీసులకు రెండువర్గాల దాడులను అడ్డుకోవడం సమస్యగా మారింది. ఎట్టకేలకు రాత్రి పీలేరు సీఐ యుగంధర్, కేవీపల్లె ఎస్ఐ చిన్నరెడ్డెయ్యలు తమ పోలీసు బలగాలను తీసుకొచ్చి ఉద్రిక్తతను తాత్కాలికంగా తగ్గించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా కేంద్రం నుంచి స్పెషల్ పోలీసులు కూడా కలికిరి చేరుకుంటున్నారు. కాగా ఒక దశలో శుక్రవారం టమోట మార్కెట్‌ను మూసివేయాలని పోలీసులు నిర్ణయించారు. అయితే రైతులు ఇబ్బంది పడతారనే ఆలోచనతో రెండు వర్గాలకు చెందిన హమాలీలను మార్కెట్‌లోకి రాకుండా చర్యలు తీసుకునేందుకు నిర్ణయించారు. ఇరువర్గాల మీద కేసులు నమోదు చేస్తున్నట్లు కలికిరి సీఐ తెలిపారు. కాలనీల పైకి పరస్పర దాడులకు పాల్పడ కుండా అన్ని చోట్ల రాత్రికి పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

వాల్మీకిపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతలవారిపల్లె గ్రామానికి చెందిన కె.బొజ్జమ్మ(80) అనే వృద్ధురాలికి మతిస్థిమితం సరిగా లేదు. ఆమె భర్త, కుమార్తె చాలా రోజుల క్రితం మృతి చెందడంతో ఆమె బాగోగులను అల్లుడు వెంకటరమణ చూసుకుంటున్నాడు. గురువారం ఈయన తన అత్తను ఇంటి వద్దనే వదిలి బంధువుల అంత్యక్రియల నిమిత్తం వేరే ఊరికి వెళ్లాడు. అదే సమయంలో బొజ్జమ్మ చింతలవారిపల్లె గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లి పాకాల నుంచి గుంతకల్లుకు వెళ్తున్న రైలుకింద పడి తీవ్ర గాయాలపాలైంది. ఈ ఘటనను గుర్తించిన స్థానికులు ఆమెను హుటాహుటిన వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందింది. కదిరి రైల్వే ఎస్ఐ రహీం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రైలు ఢీకొని మృతిచెందిన వృద్ధురాలు

మద్యం లారీ బోల్తా - త్రుటిలో తప్పిన ప్రమాదం

పెనగలూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తపల్లె చెక్‌పోస్టు సమీపంలో గురువారం రాత్రి 8 గంటల సమయంలో మద్యం లారీ బోల్తా పడింది. లారీ నడుపుతున్న డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. లారీలో తీసుకెళుతున్న సరకుకు పెద్దగా నష్టం జరగలేదు. చెక్‌పోస్టు సమీపంలో ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి లారీ బోల్తా పడినట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. ఈ సరుకు చిట్వేలి మండంలోని వైన్‌షాపునకు వెళుతున్నట్లు సమాచారం. విషయం తెలిసిన వెంటనే పెనగలూరు మద్యం షాపుల నిర్వహణ భాగస్థులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అలాగే బెస్తపల్లె సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్న పెనగలూరు పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ కూడా సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

కుట్టు శిక్షణతో ఉపాధి

- జిల్లాలో 24 శిక్షణ కేంద్రాలు
- శిక్షణానంతరం కుట్టుమిషన్లు
- మహిళల ఆర్థిక స్వావలంబనకు చర్యలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళల ఆర్థిక స్వావలంబనకు అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా కుట్టుశిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి దుస్తుల తయారీలో ప్రస్తుతం డిమాండ్‌లో ఉన్న వివిధ రకాల మోడల్ డ్రెస్సులను తయారు చేయడంలో శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 24 శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి శిక్షణ కేంద్రంలో 144 మందికి శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా కుట్టు మిషను ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇందుకు అనుగుణంగా శిక్షణ కేంద్రాల్లో శిక్షణ పొందేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అర్హులైన 15,594 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో తొలివిడతగా 3068 మందికి అవకాశం కల్పించారు. కుట్టు శిక్షణ కేంద్రంలో రోజుకు రెండు పూటలా రెండు బ్యాచ్‌లుగా ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు. శిక్షణకు హాజరైన వారందరికీ డిజిటల్ అటెండెన్స్ ద్వారా హాజరు నమోదు చేస్తున్నారు. ఈ హాజరు 75 శాతం ఉంటేనే ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేసేందుకు అవకాశం ఉంటుంది.



కడప హౌసింగ్‌బోర్డు కాలనీలో శిక్షణ నేర్చుకుంటున్న మహిళలు

వందల మంది కుట్టు శిక్షణ వైపు...

జిల్లాలోని 24 శిక్షణ కేంద్రాల్లో ప్రతిరోజూ వందలాది మంది మహిళలు ప్రభుత్వం అందిస్తున్న కుట్టు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో నూతన మెలకువలతో తయారు చేసిన దుస్తులకు మంచి డిమాండ్ ఉంది. దీంతో ఇంట్లో పనిచేసుకుంటూ కుట్టు మిషన్ల ద్వారా జీవనోపాదులను కల్పించుకోవడానికి అవకాశం ఉంటుందనే ఆలోచనతో చాలా మంది మహిళలు కుట్టుశిక్షణ వైపు దృష్టిసారిస్తున్నారు. ప్రభుత్వం కూడా కేవలం శిక్షణ ఇచ్చి వదిలేయకుండా వారికి కుట్టుమిషన్లు కూడా అందించడం పట్ల మహిళల్లో చాలా మంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

90 రోజుల పాటు శిక్షణ



జిల్లాలోని అన్ని శిక్షణ కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు మొదలు పెట్టాం. ఈ కార్యక్రమం 90 రోజుల పాటు కొనసాగుతుంది. ఈ శిక్షణలో దాదాపు 70 రోజుల పాటు ఆసక్తకరంగా నేర్చుకున్నవారికి కుట్టుమిషన్లు ఇవ్వనున్నాం. ఈ బ్యాచ్‌లు అయిపో గానే తిరిగి నూతన బ్యాచ్‌లు ఏర్పాటు చేసేందు కు ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

-జయసింహ, ఈడీ, బీసీ కార్పొరేషన్

టైలరింగ్ ద్వారా ఉపాధి



ఉచిత కుట్టు శిక్షణ ద్వారా టైలరింగ్ నేర్చుకుంటు న్నాను. ఈ శిక్షణతో ఉపాధి కలుగుతుందని ఒక నమ్మకం ఏర్పడింది. మహిళల్లో ఆర్థిక అభివృద్ధిని పెంపొందించి బతుకుదెరువుకు భరోసా కల్పిస్తున్న సీఎం చంద్రబాబుకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

-సునంద, ఎర్రగుంట్ల

ఇలాంటి శిక్షణతో జీవనోపాధి



మహిళల్లో ఆదాయ వనరులు పెంపొందించడానికి కుట్టు శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించడం సంతోషకరం. ఈ శిక్షణ వల్ల నాకు నా కుటుంబానికి ఉపాధి దొరుకుతుందనే నమ్మకం ఏర్పడింది. సాటి మహిళలకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతుంది.

-స్వప్న, బెల్లంమండీవీధి, కడప

కడప, నెల్లూరు జట్ల శుభారంభం

● ఏసీఏ సౌత్‌జోన్ రాష్ట్ర స్థాయి టీ20 క్రికెట్ పోటీలు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సీనియర్ టీ20 పోటీల్లో కడప, నెల్లూరు జట్లు శుభారంభం చేశాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)ఆధ్వర్యంలో గురువారం స్థానిక అనంతపురం క్రికెట్ స్టేడియంలో సౌత్‌జోన్ సీనియర్ టీ20 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. తొలుత కడప, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. మొదట బ్యాటింగ్ చేసిన కడప నిర్ణీత 20ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 210పరుగులు చేసింది. వంశీకృష్ణ 61బంతుల్లో 10బౌండరీలు, నాలుగు సిక్సర్లతో 98పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మరో బ్యాటర్ జహీర్ అబ్బాస్ 64పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు 20ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 165పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. కడప బౌలర్లు అరీఫ్‌బాషా 3, ధృవకుమార్ రెడ్డి 2వికెట్లు పడగొట్టారు. అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం 19.4ఓవర్లలో 158పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్ అర్జున్ టెండూల్కర్ 78పరుగులతో జిల్లాకు గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. నెల్లూరు బౌలర్ భరత్ 5వికెట్లు పడగొట్టాడు. కడప 18.5ఓవర్లలోనే 3వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. బ్యాటర్ రేవంత్‌రెడ్డి 86పరుగులు, షర్మాద్‌ఖాద్రి 56 పరుగులు సాధించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ఏసీఏ సౌత్ జోన్ అండర్-19 మెన్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కడపలో గల వివిధ స్టేడియంలలో ఈనెల 22వ తేదీ నుంచి జూలై 10 వరకు ఏసీఏ సౌత్ జోన్ అండర్-19 మెన్ మల్టీడే (మూడురోజుల మ్యాచ్) క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఈ పోటీల్లో కర్నూలు, నెల్లూరు, కడప, చిత్తూరు, అనంతపురం జట్లు తలపడనున్నాయి. అందులో భాగంగా 22 నుంచి 24 వరకు కర్నూలు - నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. అదే రోజు నుంచి కడప-చిత్తూరు జట్ల మధ్య మరో మ్యాచ్ ఉంటుంది. 25న ఆటకు విశ్రాంతి దినం. అలాగే 26 నుంచి 28 వరకు కడప-కర్నూలు, అనంతపురం - నెల్లూరు, 29న విశ్రాంతి, 30 నుంచి జూలై 2 వరకు అనంతపురం- చిత్తూరు, అదేరోజు కడప- నెల్లూరు, జూలై 3న విశ్రాంతి, 4 నుంచి 6 వరకు చిత్తూరు- నెల్లూరు, అనంతపురం - కర్నూలు, 7న విశ్రాంతి, 8 నుంచి 10 వరకు అనంతపురం- కడప, చిత్తూరు-కడప జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. పై మ్యాచ్‌లన్నీ వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంతో పాటు కేఎస్ఆర్ఎం, కేవోఆర్ఎం క్రికెట్ మైదానాల్లో జరుగుతాయని రెడ్డి ప్రసాద్ తెలిపారు.

22న క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు

వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈనెల 22వ తేదీ ఆదివారం ఉదయం 7-30 గంటలకు అండర్-16, అండర్-14 పురుషుల జిల్లా క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలి పారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికలకు తప్పక హాజరుకావాలని కోరారు. క్రీడాకారులు తమ ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్ (ఫారం-5), పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో ఒరిజినల్‌తో పాటు ఒక సెట్టు జిరాక్స్‌తో హాజరు కావాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

● మరొకరికి గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన నరేంద్రరెడ్డి

పులివెందుల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... లింగాల మండలం అంబకపల్లె గ్రామానికి చెందిన నరేంద్రరెడ్డి (35), కుళాయప్ప అనే వ్యక్తితో కలిసి బైకుపై పులివెందులకు వస్తున్నారు. పులివెందుల నుంచి ముదిగుబ్బ వైపు వెళ్తున్న కారు వీరి బైకును ఢీకొంది. దీంతో నరేంద్రరెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా కుళాయప్ప గాయపడ్డారు. మృతిచెందిన నరేంద్రరెడ్డి పొలం పనులకు సంబంధించి ట్రాక్టర్ డ్రైవర్. ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన దృశ్యం

ప్రొద్దుటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న మాలేపాటి సుదర్శన్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సీవీ సురేం ద్రరెడ్డి తెలిపారు. పట్టణంలోని సాయిబాబా కొట్టాలకు చెందిన సుదర్శన్ గురువారం స్థానిక పొట్టిపాడు రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్లో గంజాయి విక్ర యిస్తుండగా పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. ఇతని వద్ద నుంచి 1.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సుదర్శన్ నెల్లూరులో ఒక వ్యక్తి నుంచి గంజాయి కొను గో లు చేసేవాడు. వీటిని చిన్న చిన్న పొట్లాలుగా చేసి పట్ట ణంలో విక్రయిస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

గుర్రంకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు నాగార్జున (30) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీ టి.గొల్లపల్లెకు చెందిన గంగులమ్మ కుమార్తె అశ్వినికి కదిరి నియోజకవర్గం గాండ్లపెంటకు చెందిన రమణ కుమారుడు నాగార్జునతో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ క్రమంలో కొంత కాలంగా అతను అత్తగారింటి వద్దనే ఉన్నాడు. చెడు వ్యసనాలకు బానిసకావడంతో భార్య, బంధువులు మందలించారు. మనస్థాపం చెందిన నాగార్జున ఈనెల 16న విష ద్రావణం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు రాయచోటి ప్రభుత్వాసుపత్రికి, పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉక్కుపాదం : ఎస్పీ



పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

పోరుమామిళ్ల/కలసపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉక్కు పాదం మోపుతామని ఎస్పీ అశోక్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన పోరుమామిళ్ల, కలసపాడు పోలీస్‌స్టేషన్‌లను తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి... రికార్డులను చెక్ చేశారు. పలు విషయాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాటాడుతూ మహిళలు, యువతులు, విద్యార్థినుల భద్రత కోసం శక్తి టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఈ టీంలు కళాశాలలు, బస్టాండ్‌లు, రద్దీ ప్రాంతాల్లో సీక్రెట్‌గా గస్తీ తిరుగుతూ ఉంటారన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో కూడా సీసీ కెమెరాలను త్వరలో ఏర్పాటు చేస్తా మన్నారు. ప్రజలు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినపుడు అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే సీఐ, డీఎస్పీ ఆఫీసులకు వెళ్లవచ్చు న్నారు. ప్రజలకు పోలీసులకు మధ్య గ్యాప్ ఉండకూడదని ఎస్పీ పేర్కొన్నారు. సైబర్ నేరాల పట్ల ఉద్యోగులు, యువత, అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రండెన్ డ్రైవ్ వల్ల అనేక కుటుంబాలు నాశనమవుతున్నాయని, జిల్లాలో 42 ప్రమాద రహదారుల ప్రాంతాలను గుర్తించామని, అక్కడ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్, పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు తిమోతి, కొండారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫలించిన చర్చలు... సమ్మె విరమణ

● ఐసీయల్ ప్యాకింగ్ ప్లాంట్ కార్మికులు విధుల్లోకి..



మాట్లాడుతున్న కార్మికులు

ఎర్రగుంట్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల ఐసీయల్ ప్యాకింగ్ ప్లాంట్ కార్మికులు రెండు వారాలుగా చేస్తున్న సమ్మెను గురువారం విరమించారు. బుధవారం కలెక్టర్ వద్ద జరిగిన చర్చలు సఫలీకృతం కావడంతో గురువారం కార్మికులు సమ్మెను విరమించి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఐసీయల్ గేటు వద్ద ఎన్‌డీఏ ఇన్‌చార్జి మధుసూదర్‌రెడ్డితో కేక్ కట్ చేయించారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల గ్రేడ్లు పెంచేందుకు, విద్య వైద్య సౌకర్యాలు కల్పించేందుకు, కదిరివారిపల్లెలో లైటింగ్ ఏర్పాటు చేసేందుకు ఐసీయల్ యాజమాన్యం ఒప్పుకున్నట్లు తెలిపారు. అలాగే తరచూ మెడికల్ క్యాంపులు పెట్టి వైద్య సేవలు అందించేం దుకు యాజమాన్యం కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కూటమి కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టులో 15 టీఎంసీల నీరు నిల్వ

కొండాపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో ప్రస్తుతం 15.180 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోట ప్రాజెక్టు నుంచి మెయిన్‌కెనాల్‌కు 250 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. ప్రస్తు తం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు.

గండి క్షేత్రంపై ప్రభుత్వ నిర్లక్ష్యం : ఎంపీ



చక్రాయపేట, జూన్ 19 (ఆం ధ్రజ్యోతి): గండి క్షేత్రంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన గండి క్షేత్రాన్ని సందర్శించి వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎంతో ప్రసిద్ధి గాంచిన గండి క్షేత్రానికి శ్రావణమాసంలో లక్షల్లో భక్తులు వస్తుంటారన్నారు. ఆలయానికి వైసీపీ ప్రభుత్వంలో రూ.28కోట్లు మంజూరు చేసి 95శాతం పనులు పూర్తి చేశా మన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా మిగిలిన ఐదు శాతం పనులను చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పూర్తయిన ఆలయాన్ని ప్రారంభించి మూల విరాట్ విగ్రహ ప్రతిష్ఠ చేయకపోవడం ఎంత వరకు సమంజసం అన్నారు. ఆయన వెంట పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పెరటికోళ్ల పెంపకం లాభదాయకం



మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త వీరయ్య

సీకేదిన్నె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పెరటికోళ్ల పెంపకం చేపట్టడం ద్వారా రైతులకు లాభదాయకంగా ఉంటుందని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరులో గురువారం పెరటికోళ్ల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, గ్రామీణ రైతులు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పొందిన అనంతరం ఆసక్తితో ఆచరణలోకి తీసుకురావాలని, పెరటికోళ్ల పెంపకం ఆహార భద్రతను కాపాడుతుందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం పశువిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సురేష్‌కుమార్‌రెడ్డి పెరటికోళ్లలో వచ్చే ముఖ్యమైన వ్యాధులు, నివారణ చర్యలు, టీకాల ప్రాముఖ్యత, యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. ఈ సందర్భంగా మహిళా రైతులు కోళ్ల పెంపకాన్ని ఉపాధిగా చూడాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ రైతులకు 500 కోడిపిల్లలను, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కేవీకే శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, సాయిమహేశ్వరి, మహేష్‌బాబు, మానస, దినేష్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి డీడీగా నీరజ



బాధ్యతలు చేపట్టిన డాక్టర్ నీరజ

మదనపల్లెటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధకశాఖ మదనపల్లె డివిజన్ ఇన్‌చార్జి డీడీగా డాక్టర్ నీరజ బాధ్యతలు చేపట్టారు. గురువారం స్థానిక డీడీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ వాల్మీకిపురం ఏడీగా పనిచేస్తున్న తాను బదిలీపై మదనపల్లెకు వచ్చానని, ఇక్కడ డీడీగా పనిచేసిన సత్యనారాయణ బదిలీపై వెళ్లడంతో ఇన్‌చార్జి డీడీగా బాధ్యతలు చేపట్టానన్నారు. ప్రభుత్వం పాడి రైతులకు అందించే సంక్షేమ పథకాలను వారికి అందుబాటులో తీసుకెళతానన్నారు. నిరవధికంగా గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

అయినవారే వదిలేసి వెళ్లారు..

● మానవత్వం మంటగలుస్తున్న వేళ...



ఆసుపత్రిలో వదిలేసి వెళ్లడంతో చింతిస్తున్న లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజు రోజుకు మానవ సంబంధాలు దారుణంగా క్షీణిస్తున్నాయి. మానవత్వం మంటగలుపుతున్న సంఘటన ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... నాలుగు రోజుల క్రితం వైఎంఆర్‌కాలనీ అడ్రస్‌తో లక్ష్మీదేవి అనే మహిళను పక్షవాతం సోకిందని వారి కుటుంబీకులు ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. చేర్పించేటప్పుడు ఇచ్చిన అడ్రస్సుతో పాటు సెల్‌ఫోన్ నెంబరు కూడా ఫేక్ ది ఇచ్చారు. దీంతో గత నాలుగు రోజులుగా ఆ మహిళ ఆసుపత్రిలో ఒంటరిగా ఉంటోంది. ఆమెకు పక్షవాతం సోకడంతో సరిగా మాట్లాడలేక పోతోంది. అయితే ఆమెది వైఎంఆర్‌కాలనీ ఏరియా అని మాత్రం చెబుతున్నట్లు ఆసుపత్రి సిబ్బంది చెబుతున్నారు. పక్షవాతం సోకిన ఆమహిళకు కనీసం ఒక అటెండెంట్ లేకుండా వుండటంతో ఆసుపత్రి సిబ్బంది ఆమె కాలకృత్యాలు తీర్చడం లాంటి పనులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఆసుపత్రి సిబ్బంది ఇచ్చిన అడ్రస్సుకు ఫోన్ నెంబరుకు ఫోన్ చేస్తే అవి పనిచేయకపోవడం బట్టి వారు ప్లాన్ ప్రకారం ఆమెను అక్కడ వదిలేసి వెళ్లారని అర్థమౌతోంది. అనారోగ్యంతో వున్న ఆ మహిళ బంధువులు వచ్చి ఆమె బాగోగులు చూసుకోవాలని.. లేకుంటే ఆమె వివరాలు తెలిశాక వారి కుటుంబీకులను విచారించి కేసులు కట్టవలసి వస్తుందని ఔట్‌పోస్టు పోలీసులు హెచ్చరిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు అయినా ముందుకు రావాలని ఆసుపత్రి సిబ్బందితో పాటు ఔట్‌పోస్టు పోలీసులు కోరుతున్నారు.

ఇలా అయితే కుట్టు శిక్షణ పొందేది ఎలా?



కుట్టుపడని మిషన్లతో కుస్తీ పడుతున్న మహిళలు

సంబేపల్లె, జూన్19(ఆంధ్రజ్యోతి): మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండల కేంద్రాల్లో కుట్టుశిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ మిషన్లలో తలెత్తిన సాంకేతిక లోపాల కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాల ద్వారా శిక్షణ ఇచ్చేందుకు ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. అయితే నిర్వహణలో లోపాలు కారణంగా మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ఒక్కొక్క మండలంలో 100 నుంచి 150 మంది మహిళలకు ఉదయం, మధ్యాహ్నం శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా సంబేపల్లె మండల కేంద్రంలో వెలుగు కార్యాలయంలో కుట్టు శిక్ష ణా కేంద్రం ఏర్పాటు చేశారు. మహిళలకు టైలరింగ్ నేర్పేందుకు కొన్ని మిషన్లను తీసుకొచ్చారు. అయితే ఈ మిషన్లు కుట్టే పడకపోవడంతో కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ విషయం పలుమార్లు చెప్పినా నిర్వాహకులకు పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కుట్టు పడని మిషన్లతో అవస్థలు తప్పడం లేదంటున్నారు. ఇలాగైతే శిక్షణ పొందేది ఎలా అంటూ వారు పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా చేపడితే ఎంతో మంది మహిళలకు ఆర్థిక జీవనోపాధి కల్పించినట్లు అవుతుందన్నారు. మండలానికి 30 టైలరింగ్ మిషన్లు తెచ్చినట్లు తెలిపారు. నేర్చుకునే సమయంలో సాంకేతిక సమస్యలు వస్తున్నట్లు పేర్కొన్నారు. కొన్ని మిషన్లు అసలు పనిచేయలేదని వారు తెలిపారు. ఇప్పటికైనా సక్రమంగా పనిచేసే కుట్టు మిషన్ల ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి మార్గం కల్పించాలని వారు విన్నవించారు.

జనరంజక పాలన అందిస్తున్న బీజేపీ

● పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్



వికసిత్ భారత్‌లో భాగంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న సాయిలోకేశ్

రైల్వేకోడూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్లుగా జనరంజక పాలన అందిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరులో వికసిత్ భారత్ కార్యక్రమ కో-కన్వీనర్ తోట శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. విద్యా, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ భారతదేశాన్ని ప్రపంచ పటంలో అగ్రగామిగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ముందుకెళుతున్నారన్నారు. అంకుటిత దీక్ష ఫలితంగా ఇతర దేశాలతో దౌత్య సంబంధాలు బలపడ్డాయని గుర్తు చేశారు. అనంతరం వికసికత్ భారత్ సంకల్ప సభ ప్రతిజ్ఞ చేయించారు. పార్టీ మండల అధ్యక్షుడు సాయం శ్రీధర్, పర్యావరణ కో-కన్వీనర్ రామసుబ్బారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణవర్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ ద్వారా దేశానికి ప్రపంచ గుర్తింపు

రాయచోటిటౌన్, జూన్19(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ద్వారా భారత దేశానికి ప్రపంచ గుర్తింపు లభిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ కొనియాడారు. మోదీ 11 సంవత్సరాల పాలన పూర్తి అయిన సందర్భంగా గురువారం రాయచోటి మండల పరిధిలోని వరిగ గ్రామంలో రాయచోటి అసెంబ్లీ కోకన్వీనర్ నిర్మల్‌కుమార్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలోకేశ్ మాట్లాడుతూ మోదీ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. కన్వీనర్ చీర్ల శ్రీనివాస్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, ఆనందగజపతిరాజు, అసెంబ్లీ కన్వీనర్ నిర్మల్‌కుమార్, రాష్ట్ర మైనార్టీ మోర్చ ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, మండల నాయకులు పాల్గొన్నారు.

కాల భైరవుడికి ప్రత్యేక పూజలు

నందలూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ పక్కన వెలసిన వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలోని కాలభైరవుడికి గురువారం అష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సరసా రవికుమార్‌శర్మ ఆధ్వర్యంలో అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

మలేరియాపై విద్యార్థులకు అవగాహన

సిద్దవటం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా గురువారం టక్కోలి హైస్కూలులో పి.కొత్తపల్లె ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి రంగలక్ష్మి అధ్యక్షతన జ్వరాలపై విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాయుడు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

పశువుల పెంపకంపై శిక్షణ

ఒంటిమిట్ట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : పాడి పశువులు, పశుగ్రాసాల పెంపకం కోసం ఆధునిక యాజమాన్య పద్ధతులపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ ఏడీ ఉమ తెలిపారు. వచ్చే నెల 28 నుంచి 30 వరకు కర్నూలులో శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. కర్నూలులోని పశువుల ఆసుపత్రి ఆవరణంలో ఉన్న ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణ కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. మండలంలోని రైతులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొనవచ్చునన్నారు. పాల్గొన్నవారికి ఉచిత భోజన సదుపాయాలతో పాటు సర్టిఫికెట్లు కూడా ఇస్తారన్నారు. కావున ఆసక్తి గత రైతులు స్థానిక పశుసంవర్ధక కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

నందలూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, హైస్కూల్ చైర్మన్ ఉపేంద్ర ఆధ్వర్యంలో గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బదిలీపై వెళుతున్న రౌఫ్‌బాషా, రజని, కృష్ణయ్య, సురేష్, మూర్తి, వరప్రసాద్‌లను పూలమాల, శాలువాతో సన్మానించారు. విద్యార్థులు గురువులుకు బహుమతులు అందజేశారు. జనసేన నాయకుడు కొట్టే శ్రీహరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుల సమావేశం



మండల పరిశీలకులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ప్రవీణ్‌కుమార్, చిట్టిబాబు

రాజంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) :రాజంపేట నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ నిర్వహించనున్న పార్టీ సంస్థాగత ఎన్నికలపై ఆ పార్టీ ఎన్నికల పరిశీలకులు సమావేశం నిర్వహించారు.నియోజకవర్గానికి నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యుల్లో ప్రొద్దుటూరుకు చెందిన నియోజకవర్గ టీడీపీ నాయకుడు ప్రవీణ్‌కుమార్, గంగాంధర నెల్లూరుకు చెందిన చిట్టిబాబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వీరబల్లె, సుండుపల్లె, సిద్దవటం, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట మండలాలతో పాటు రాజంపేట మున్సిపాలిటికి చెందిన పార్టీ సంస్థాగత ఎన్నికలపై మాట్లాడారు. ఆరు మండలాలతో పాటు మున్సిపాలిటికి చెందిన మండల ఎన్నికల పరిశీలకులతో చర్చించారు. పార్టీ నియమావళి మేరకు సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తామని, పార్టీల్లో కష్టపడేవారికి, సీనియర్లకు పార్టీ అభ్యున్నతికి ఉపయోగపడేవారికి ప్రాధాన్యత కల్పిస్తామని వారు తెలిపారు.

ఘనంగా గాదెల గంగమ్మ జాతర



జాతరలో కిక్కిరిసిన జనం (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఓబులవారిపల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గాదెల గ్రామ పంచాయతీలో 8 సంవత్సరాల అనంతరం గంగమ్మ జాతర ఘనంగా జరిగినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గాదెలలో తర చూ గొడవలు జరిగే విషయం తెలిసిందే. దీంతో రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లె ఎస్‌ఐ మహేష్‌తో కలిసి జాతరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాయుడోరి రమణ, టీడీపీ సీనియర్ నేత కస్తూరి విశ్వనాథ నాయుడు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, సీనియర్ నాయకులు అజయ్‌బాబు, లారీ సుబ్బరాయుడు, బాలు రామాంజనేయులు తదితరులు జాతరలో పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుదాం



రామాపురం: నీలకంఠ్రావుపేటలో యోగా చేస్తున్న నాయకులు, అధికారులు

రామాపురం, జూన్19(ఆంధ్రజ్యోతి): యోగా చేసి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుదామని టీడీపీ మం డల నీలకంఠ్రావుపేట మైనార్టీ నాయకుడు, ఉప సర్పంచ్ మహబూబ్‌బాషా అన్నారు. గురువారం మండలంలోని నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు యోగాసనాలు చేపట్టారు. అలాగే సూర్యనారాయణపురం గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది, కూలీలు యోగాలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా, ఉల్లాసంగా ఉండవచ్చునన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రైల్వేకోడూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు అన్నారు. గురువారం రైల్వేకోడూరు పట్టణం లోని సిల్వర్‌బెల్స్ హైస్కూలులో నిర్వహించిన యోగా సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా చేయాలనే ఉద్దేశ్యంతో దేశ ప్రజలకు చాటి చెప్పడం కోసం భారత ప్రధాని నరేంద్రమోదీ విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎంవీ కుమార్, ప్రధానోపాధ్యాయుడు లక్కాకుల రాహుల్, హెడ్‌మిస్ట్రెస్ విజయలక్ష్మి, వికసిత్ భారత్ కన్వీనర్ తోట శ్రీనివాసులు, బీజేపీ మండల అధ్యక్షుడు సాయం శ్రీధర్, పుల్లంపేట అధ్యక్షుడు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో...

ఒంటిమిట్ట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : తిరుమల- తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఒంటిమిట్టలో గురువారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కోదండ రామాలయం సమీపంలోని పార్కులో యోగా నిర్వహించారు. గురువు యోగా గురించి వివరించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వీణారాఘవాచార్యులు యోగాసనం గురించి వివరించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్, సిబ్బంది ప్రవీణ్‌కుమార్, ఆలయ సిబ్బంది, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

రేపు అన్ని గ్రామ సచివాలయాల్లో యోగాంధ్ర

లక్కిరెడ్డిపల్లె, జూన్19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఈ నెల ఈనెల 21వ యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీవో ఉషారాణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఆదేశాల మేరకు ఆయా అధికారులకు కేటాయించిన సచివాలయంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ యోగాంధ్రలో పాల్గొనాలని కోరారు.

సుగవాసి ప్రసాద్‌బాబు పరామర్శ

రాయచోటిటౌన్, జూన్19(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త, సీనియర్ మైనార్టీ నేత హాజీ బేపారి బషీర్‌ఖాన్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు గురువారం ఆయన్ను పరామర్శించారు. ఆయన కుమారుడు మహమ్మద్‌తో ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మయాన ఇర్షాద్‌ఖాన్, సుగవాసి శ్రీనివాసులు, మన్నేరు రామాంజనేయులు, బడిశెట్టి రవి, అప్రోజ్, సాదిక్ పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం.. బహుళ ప్రయోజనం

సిద్దవటం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యం.. బహుళ ప్రయోజనం అని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్వీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని టక్కోలిలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడడం వల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయి. భూసారం క్షీణిస్తుందన్నారు. కావున ప్రతిరైతు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించాలన్నారు. బద్వేలు సహాయ సంచాలకులు ఎం.నాగరాజు మాట్లాడుతూ చిరు ధాన్యాలు సాగు చేస్తూ ఆహార అలవాట్లు మార్చుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.

'అన్నదాత సుఖీభవ'ను అందరికీ ఇవ్వాలి

చిట్వేలి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకాన్ని డీకేటీ, మెట్ట, ఇనాం తదితర భూములు కలిగిన రైతులందరికీ వర్తింపజేయాలని రైతు సంఘం నాయకుడు మలిశెట్టి రాహుల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చిట్వేలిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులందరికీ రైతుభరోసా అందించినట్లుగానే ఈ ప్రభుత్వం కూడా అన్నదాత సుఖీభవను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకటయ్య, అంగడి నారాయణ, మణి, చెంగయ్య, రమణ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

పెనగలూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి) :కేంద్ర ప్రభుత్వ ప్రవేశ పెట్టిన పథకాలపై శుక్రవారం ఓబిలి గ్రామ పంచాయతిలోని గ్రామాల్లో మండల బీజేపీ అధ్యక్షులు కోనేటిరెడ్డి క్రిష్ణరాయల్ అధ్యక్షతన ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృతంగా ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న పథకాల గురించి కరపత్రాల ద్వారా ప్రతిఒక్కరు తెలుసుకోవాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా బీజేపీ కార్యకర్తలతో గ్రామ సమావేశం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు సోమశిల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శులు పొడమేకల మోహన్‌యాదవ్, ఉత్తన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట 'అన్నమాచార్య'కు లా కోర్సు మంజూరు

రాజంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : అన్నమచార్య యూనివర్శిటీకి మూడు సంవత్సరాల ఎల్‌ఎల్‌బీ కోర్సుకు మంజూరు చేస్తూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు జారీ చేసినట్లు యూనివర్సిటీ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ న్యాయవిద్యా కోర్సు రాజంపేటకు అనుమతి రావడంతో ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో సౌకర్యం ఏర్పడిందని తెలిపారు. కావున ఎల్‌ఎల్‌బీ చేరే వారు రాజపేటలోనే చదువుకోవడానికి మంచి అవకాశం లభించిందని వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఈ.సాయిబాబారెడ్డి తెలిపారు. ఎల్‌ఎల్‌బీ కోర్సు మంజూరులో యూనివర్సిటీ ప్రొ చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి కృషి ప్రశంసనీయమని తెలిపారు.

డీలర్లు బాధ్యతగా వ్యవహరించాలి

రైల్వేకోడూరు రూరల్, 19జూన్(ఆంధ్రజ్యోతి): చౌకదుకాణం డీలర్లు బాధ్యతగా వ్యవహరించాలని రైల్వేకోడూరు తహసీల్దార్ అమర్‌నాథ్ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా చౌకదుకాణంలో నిత్యావసర సరుకులను సమయ పాలన పాటించి అందజేయాలన్నారు. అనంతరం డీలర్లు తహసీల్దార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీ డీటీ శ్రీనివాసులు, డీలర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

లక్కిరెడ్డిపల్లె, జూన్19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి నాగమణి పేర్కొన్నారు. గురువారం సర్పంచ్ రెడ్డెయ్య అధ్యక్షతన షెడ్యూల్ తెగల కులాల వారికి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఈ నెల 15 నుంచి 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీహెచ్‌వో రవీంద్ర, మహిళా పోలీస్ నాగమణి, ఏఎన్‌యం పద్మావతి, ఎంఈవో పావని, సచివాలయ సిబ్బంది ప్రతాప్, పృధ్విరాజ్, రెడ్డెయ్యలు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్

రాజంపేట టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రతకు శక్తి యాప్ ఓ రక్షణ కవచంలా పని చేస్తుందని ఏఎస్‌ఐ ఖాసింపీరా తె లిపారు. గు రువారం పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో అవగాహనకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల విద్యార్థులకు భద్రత ఉంటుందన్నారు. అత్యవసర సమయంలో పోలీసు స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఈ యాప్ ద్వారా 100, 112, ఎస్‌ఓఎస్ బటన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. శక్తి వాట్సాప్ నంబరు 7993 485111ను కూడా అందుబాటులోకి తెచ్చారన్నారు. మహిళా పోలీసు సిబ్బంది కల్పన, రాజేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల సంసిద్ధత కార్యక్రమం


రాయచోటిటౌన్, జూన్19(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని మార్కెట్ స్ట్రీట్ ప్రాథమిక పాఠశాలలో గురువారం పాఠశాల సంసిద్ధత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ ఏసీడీపీవో సుగుణమ్మ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుగుణమ్మ మాట్లాడుతూ పాఠశాలలో చేరే పిల్లలకు పాఠశాల వాతావరణం, ఆటపాటల ద్వారా సన్నద్ధం చేయడమే పాఠశాల సంసిద్ధత కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పిల్లల్లో రాయడం, చదవడం, సంఖ్యా జ్ఞానాన్ని పరిపూర్ణంగా తేవాలన్నారు. మోడల్ ఫౌండేషన్ స్కూల్ ఉపాధ్యాయులు సురేంధర్‌రెడ్డి, నాగరాజు, ప్రదం కో ఆర్డినేటర్ రాజశేఖర్, జీపీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రా హుల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివసుబ్బమ్మ, పద్మజ, అంగన్వాడీ టీచర్ విజయమ్మ పాల్గొన్నారు.

ఆర్ఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులు

సంబేపల్లె, జూన్19(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండల ఆర్ఐగా బుక్కే శ్రీనివాసులునాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాయచోటి కలెక్టరేట్‌లో పనిచేస్తూ సుండుపల్లె డిప్యూటేషన్‌పై వెళ్లారు. సుండుపల్లె మండలంలో పనిచేస్తూ తిరిగి డిప్యూటేషన్‌పై సంబేపల్లెకు వచ్చారు. సంబేపల్లె ఆర్ఐగా పనిచేసిన రవికుమార్ బదిలీల్లో భాగంగా ఆర్డీవో ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

టీచర్లకు సకాలంలో జీతాలు చెల్లించాలి

● నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరాజు



మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

రాయచోటి టౌన్, జూన్19(ఆంధ్రజ్యోతి): తాజాగా బదిలీ అయిన ఉపాధ్యాయులకు సకాలంలో జూన్ నెల వేతనాలు అందేటట్లు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు కోరారు. గురువారం రాయచోటి పట్టణంలోని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొజిషన్ ఐడీలు, సీఎఫ్ ఎంఎస్ అనుసందానం సమస్యలు లేకుండా ట్రెజరీ అధికారులకు విద్యాశాఖ సమగ్ర నివేదికను పంపాలని కోరారు. కొత్తగా ఏర్పడ్డ పీఎస్‌హెచ్‌యం పోస్టులు, రీపోస్మెంట్ ఖాళీల్లో చేరిన ఉపాధ్యాయులకు జూన్ నెల వేతనం సకాలంలో అందేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. నాన్ డ్రాయిల్ సర్టిఫికెట్‌తో కొత్త పాఠశాలలు, మండలాల్లో జూన్ నెల పూర్తి వేతనం చెల్లించేటట్లు ఆదేశాలు ఇవ్వాలన్నారు. సీఎఫ్ ఎంఎస్‌లో మారిన ఉపాధ్యాయుల క్యాడర్‌ను అప్డేట్ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే త్వరలో జరగబోయే కౌన్సెలింగ్‌లో వారి స్థానిక మండలం సమీప మండలాల్లో పోస్టింగు ఇచ్చే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు నల్లమల రామాంజులు, పక్కీర, బచ్చల శ్రీనివాసులు, కులశేఖర్‌రెడ్డి, గోవిందు నాగరాజు, చక్రపాణి, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నాయకులపై దాడికి నిరసన

రాయచోటిటౌన్, జూన్19(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఏఐఎస్ఎఫ్ నాయకులపై పోలీసులు లాఠీచార్జ్ చేసిన ఘటనను ఖండిస్తూ గురువారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాయచోటిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మాధవ్ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ నాయకులు కార్పొరేట్ విద్యకు వ్యతిరేకంగా పోరాడుతున్నందుకే పోలీసులను ఉపయోగించి ఉద్యమాన్ని అణిచివేత చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకులు మహమ్మద్, దినేశ్, నారాయణ, రెడ్డి, తదితర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లెంవారిపల్లెలో ఎమ్మెల్యే పర్యటన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్

ఓబులవారిపల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని తల్లెంవారిపల్లె గ్రామంలో ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్ పర్యటించారు. గ్రామస్థుల ఆహ్వానం మేరకు గంగమ్మ జాతర కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం గాదెలలో గంగమ్మ గుడికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వమించారు. ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పునాటి వాసుదేవరెడ్డి, కల్లా చలపతి, వేమన సుబ్రమణ్యంనాయుడు, బీజేపీ నాయకులు చిన్నరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారం పోయినా అహంకారం తగ్గలేదు : చమర్తి



మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

సిద్దవటం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి అధికారం పోయినా అహంకారం తగ్గలేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు అన్నారు. మండలంలోని భాకరాపేట గ్రామంలో గురువారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక టీడీపీ కార్యకర్తలను రఫ రఫామంటూ నరికేస్తామని చెప్పడం సబబు కాదన్నారు. టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్ర ప్రజలు మీకు ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా తీర్పు ఇచ్చినా మీ ధోరణి మారలేదని తెలిపారు. బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దశరథరాయుడు, సర్పంచ్ ప్రతినిధి ప్రసాద్‌నాయుడు, ఉపసర్పంచ్ ప్రతినిధి నరసింహారెడ్డి, నిత్యపూజకోన మాజీ చైర్మన్ రాజేంద్రప్రసాద్ తదితర టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య

సుండుపల్లె, జూన్19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య అందించడం జరుగుతుందని విద్యార్థినీ, విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని రాయవరం సర్పంచ్ షరీఫ్ తెలిపారు. గురువారం మండలంలోని రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూలో 160 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించిన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసంపై విచారణ



అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

పీలేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం గర్నిమిట్ట పంచాయతీ మల్లారపు వాండ్లపల్లె నల్లగుట్ట క్రాసు హౌసింగ్ కాలనీలో ఉన్న డా.బీఆర్. అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఏపీ ఎంఆర్‌పీఎస్ నాయకులు గురువారం ఉదయం ఆ ఘటనపై కలెక్టర్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించారు. ఆయన ఆదేశాలతో కలకడ ఇన్‌చార్జ్ సీఐ ప్రసాద్‌బాబు, తహసీల్దారు నరేంద్రకుమార్, ఎస్ఐ చిన్నరెడ్డప్ప సంఘటనా స్థలాన్ని పరిశీలించి దెబ్బతిన్న అంబేడ్కర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేశారు. ఈ సంఘటనపై కేవీపల్లెకు చెందిన ఏపీఎంఆర్‌పీఎస్ నేత ముల్లంగి చంద్రయ్య మాట్లాడుతూ నల్లగుట్ట వద్ద గత ప్రభుత్వ హయాంలో దళితులకు హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేశారని, ఆ సమయంలోనే తాము అక్కడ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కాగా కొందరు అగ్రవర్ణాల వారు కాలనీ, అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకున్నారని ఆయన తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ, తహసీల్దారు మాట్లాడుతూ తగిన విచారణ జరిపి, నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షిస్తామని దళిత సంఘ నాయకులకు హామీ ఇచ్చారు.

యోగాంధ్రకు సిద్ధంగా ఉండాలి: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాయచోటిలో జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21న యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు తదితర అధికారులతో ఈ నెల 21న జిల్లా వ్యాప్తంగా నిర్వహించబోయే యోగాంధ్ర కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యోగాను ప్రజల జీవితంలో భాగస్వామ్యం చేసినప్పుడే యోగాంధ్ర కార్యక్రమం విజయవంతమైనట్లు అవుతుందన్నారు. నెల రోజులుగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణలో అన్నమయ్య జిల్లా మొదటి స్థానంలో ఉందని అధికారులు, సిబ్బంది వలనే ఈ విజయం సాధ్యమైందన్నారు. ఈ నెల 21న రాయచోటిలో 5 వేల మందితో దేవాంతర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

పల్లెపండుగ బకాయిలు రూ.86 కోట్లు

- ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులు
- అప్పులపాలైన టీడీపీ నాయకులు



రామసముద్రం మండలం వాల్మీశ్వరస్వామి కొండపై అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులు

మదనపల్లెటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో అభివృద్ధి పనులు చేపట్టండి... ఏజెన్సీల చేత పనులు చేయించే బాధ్యత పీఆర్ ఏఈలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులదే.. లక్ష్యాలను చేరుకోకుంటే జీతాలు నిలిపివేస్తాం అంటూ జిల్లా ఉన్నతాధికారులు మండలస్థాయి అధికారులను వెంటబడ్డారు. కింది స్థాయి అధికారులేమో టీడీపీ నాయకులను బతిమలాడి పల్లెపండుగ పనులు చేయించారు. ఇప్పుడు చూస్తే నాలుగు నెలలవుతున్నా చేసిన పనులకు బిల్లులు పడలేదు. అప్పులు చేసి కాంట్రాక్టు పనులు చేసిన టీడీపీ నాయకులు అధికారుల మీద పడుతున్నారు. వారేమో తప్పించుకుని తిరుగుతున్నారు. ఇదీ జిల్లా వ్యాప్తంగా పల్లెపండుగ కార్యక్రమంలో నిర్వహించిన పనులపై సుమారు రు.86 కోట్ల బకాయిల సంగతి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అన్నమయ్య జిల్లాకు పల్లెపండుగ కార్యక్రమానికి రూ.63 కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద సీసీ రోడ్లు, పశువులకు నీటి తొట్టెలు, మినీ గోకులాల నిర్మాణాలు చేపట్టారు. కేవలం ఏజెన్సీల చేత ఈ పనులు చేయించాలని చెప్పడంతో గ్రామాల్లో టీడీపీ నాయకులు చోటామోటా కాంట్రాక్టర్లుగా మారి అప్పులు చేసి నిర్మాణ పనులు చేపట్టారు. రైతులు వారి పొలాలు, ఇళ్ల వద్ద నీటితొట్టెలు, మినీ గోకులాలు నిర్మించుకున్నారు. మొదటి విడత కొంతమందికి బిల్లులు పడ్డాయి కానీ ఆ తర్వాత చాలామందికి పడలేదు. ఇక కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి సీసీ రోడ్ల పనులు చేసిన టీడీపీ నాయకులు చేసిన పనులకు బిల్లులు పడక అప్పుల పాలయ్యారు. ముఖ్యంగా గ్రామాల్లో అయితే వందల సంఖ్యలో టీడీపీ నాయకులు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. దీంతో మూడు నెలలుగా జిల్లాలో ఎక్కువ ప్రాంతాల్లో పల్లెపండుగ పనులు నిలిపివేశారు. కనీసం పార్టు బిల్లులు పడితేనే పనులు పూర్తి చేస్తామని టీడీపీ నాయకులు, ఏజెన్సీలు మొండికేసి కూర్చున్నారు.



మదనపల్లె మండలం వేంపల్లె మల్లయ్యకొండపై నిలిచిపోయిన రోడ్డు పనులు

తారురోడ్లకు రూ.50 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్‌కు రూ.36 కోట్ల బకాయిలు

జిల్లాలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల కింద పల్లెపండుగ కార్యక్రమంలో 1206 నీటితొట్టెలు మంజూరు కాగా వాటిలో 1171 నీటితొట్టెల నిర్మాణం పూర్తి చేశారు. 1240 మినీ గోకులాలు మంజూరు కాగా వాటిలో 1175 మినీ గోకులాల నిర్మాణాలు పూర్తి చేశారు. 842 సీసీ రోడ్లు మంజూరు కాగా 601 సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. వీటికి 2024-25 మార్చి వరకు రూ.35.16 కోట్ల బకాయిలు అలాగే ఉన్నాయి. ఇవి కాక ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే, జూన్ 10వ తేది వరకు చేసిన పనుల బిల్లులు వీటికి అదనం.

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో రూ.50 కోట్లు

జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో పల్లె పండుగ కార్యక్రమాల్లో తారు రోడ్లు, వెట్ మిక్సింగ్ రోడ్లు, కంకర రోడ్లు, పాఠశాలల ప్రహరిగోడల నిర్మాణాలు చేపట్టారు. జనవరిలో సంక్రాంతి వరకు కాంట్రాక్టర్లకు అంతో ఇంతో బిల్లులు పడ్డాయి. కానీ తర్వాత ఎక్కువశాతం పనులకు బిల్లులు పెండింగ్ పెట్టేశారు. ఉదాహరణకు మదనపల్లె నియోజక వర్గంలోని రామసముద్రం మండలం వాలీశ్వర స్వామి కొండపైకి రూ.2.06 కోట్లతో కొత్త రోడ్డు నిర్మాణం, మదనపల్లె మండలంలో వేంపల్లె మల్లయ్యకొండపైకి రూ.1.05 కోట్లతో కొత్త రోడ్డు నిర్మాణం ప్రారంభించారు. పెద్ద మొత్తంలో ఉన్న ఈ పనుల్లో టీడీపీ నాయకులు రోడ్డు ఫార్మేషన్‌కే ఎక్కువ ఖర్చు పెట్టారు. కానీ వారికి ఇంతవరకు బిల్లులు పడలేదు. దీంతో ఎక్కడ పనులు అక్కడే నిలిపివేశారు. ఇకపోతే గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేసి వాటిని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల చేత అట్టహాసంగా ప్రారంభింపజేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కానీ ఇంతవరకు వారికి బిల్లులు చెల్లించలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే టీడీపీ నాయకులు (కాంట్రాక్టర్లు) వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఈ నెలాఖరుకు బిల్లులు రావచ్చు

జిల్లాలో పల్లెపండుగ కార్యక్రమంలో ఎన్‌ఆర్ ఈజీఎస్, పీఆర్ ఆధ్వర్యంలో పనులు నిర్వహించాము. వీటిలో రూ.40 నుంచి 50 కోట్ల వరకు పీఆర్ శాఖ పనులకు బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. ఈనెలాఖరులోగా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయొచ్చు. ఆదేశాలు వచ్చిన వెంటనే అందరికీ బిల్లులు చెల్లిస్తాం.

- దయాకర్‌రెడ్డి, ఈఈ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, రాయచోటి



కోళ్లబైలు పంచాయతీ వన్నూర్‌సాబ్ గుట్టపై నిర్మించిన సీసీరోడ్డు

దాడిచేసిన డిజిటల్ అసిస్టెంట్‌పై కఠిన చర్యలు

- బాధిత కుటుంబానికి అన్ని విధాలా న్యాయం
- సచివాలయంలో ఘటనకు... ప్రభుత్వం తరపున సారీ..
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



గుమ్మసముద్రం సచివాలయ ఘటనలో గాయపడిన వ్యక్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

బి.కొత్తకోట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగి చేసిన పనికి ప్రభుత్వం తరపున సారీ.. మీ కుటుంబానికి అన్ని విధాలా న్యాయం చేస్తాం.. మీ రెండవ బిడ్డకు కూడా తల్లికివందనం నిధులు పడేలా చూస్తాం.. మిమ్మల్ని అవమానించి, గాయపరిచిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం.. జరిగిన ఘటనకు చింతిస్తున్నాం... అంటూ సాక్షాత్తూ కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆ కుటుంబాన్ని ఓదారుస్తూ హామీ నిచ్చారు.

బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం పంచాయతీ సచివాలయంలో బుధవారం జరిగిన ఘర్షణలో ఓ కుటుంబంపై స్థానిక డిజిటల్ అసిస్టెంట్ బాబా ఫక్రుద్దీన్ దాడి చేయడంతో ముగ్గురు వ్యక్తులు గాయపడి, కేసు నమోదైన విషయం తెలిసిందే. సమాచారం అందగానే ఘటనపై విచారణాధికారిగా మదనపల్లి సబ్‌కలెక్టర్‌ను నియమించి పూర్తి వివరాలను కలెక్టర్ తెప్పించుకున్నారు. గురువారం హార్సిలీహిల్స్ పర్యటనకు వచ్చిన నేపథ్యంలో గుమ్మసముద్రం ఘటన బాధితులను కలసి మాట్లాడేందుకు జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌లతో కలిసి గండువారిపల్లికి విచ్చేశారు. కలెక్టర్ హోదాలో సచివాలయంలో కూర్చుని ఘటనపై విచారణ చేసి, బాధితులను అక్కడికే రప్పించుకుంటారని అందరూ భావించారు. అయితే ఆయన గండువారి పల్లికి వెళ్లి బాధితుల నివాసంలో శంకరప్ప, అనురాధ, నాగభూషణంలతో నేరుగా మాట్లాడారు. జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగి దాడి చేసిన తీరును, తమకు జరిగిన అవమానాన్ని వివరిస్తూ శంకర, అనురాధలు కన్నీటి పర్యంతమయ్యారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ బాధితుల వైద్య ఖర్చులను స్వయంగా భరిస్తానని, పెండింగ్‌లో ఉన్న పక్కాగృహానికి రూ.70 వేలు అదనపు సాయం అందేలా చూస్తానని, తల్లికి వందనం నిధులు పడేలా చూస్తామన్నారు. మండలంలోని సచివాలయ ఉద్యోగులను సమావేశపరిచి పనుల నిమిత్తం వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మెలిగేలా కౌన్సెలింగ్ ఇవ్వాలని ఎంపీడీవో క్రిష్ణవేణిని ఆదేశించారు. అనంతరం గ్రామస్థులు పలు సమస్యలపై కలెక్టర్‌కు విన్నవించారు. తమ గ్రామంలో రీసర్వే సమయంలో జాయింట్ ఎల్పీఎం పెట్టడంతో 1బి రావడం లేదని, పలువురికి తల్లికివందనం నిధులు పడలేదని గ్రామస్థులు కలెక్టర్‌కు విన్నవించారు. ఈ నెల 25న గ్రామంలో గ్రామసభ నిర్వహించి, అర్జీలను తీసుకుంటామని రైతులకు సంబంధించిన అన్ని సమస్యలను తీరుస్తామని కలెక్టర్ హామీనిచ్చారు. కార్యక్రమంలో సీఐ జీవన్‌గంగనాథబాబు, ఎంపీడీవో క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ తొలగింపు

రాజంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గతంలో రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలపై అశ్రద్ధ వహించిన గత మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరర్‌రావు సస్పెన్షన్‌ను తొలగిస్తూ మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ రాజంపేటలో కమిషనర్‌గా నియమించారు. అయితే ప్రభుత్వం నిర్దేశించిన రెవెన్యూ రాబడి విషయంలోనూ, ఇంటింటి సర్వేలోనూ ఇతరత్ర మున్సిపాలిటీ నిర్దేశిత లక్ష్యాల్లోనూ నాగేశ్వరరావు అలసత్వం చూపుతున్నారని పేర్కొంటూ ఆయనను బదిలీ చేస్తూ సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా ప్రస్తుతం శ్రీనివాసులు పని చేస్తున్నారు. అయితే బదిలీపై వెళ్లి సస్పెన్షన్‌కు గురైన నాగేశ్వరరావు మరో పది నెలల్లో పదవి విరమణ వయస్సు పూర్తి కానందున తమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఉన్నతాధికారులను అభ్యర్థించారు. నాగేశ్వరరావు అభ్యర్థనను పరిశీలించిన ప్రభుత్వం సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ రెవెన్యూ రాబడి, ఇతర ప్రాధాన్యతలేని పోస్టులో నాగేశ్వరరావును కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయనపై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేస్తూ ప్రాధాన్యత లేని పోస్టులో త్వరలో ఆయనను నియమించనున్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తాం

- కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇచ్చిన ఇంజనీరింగ్ కార్మికులు



మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

రాయచోటిటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఈ నెల 22 నుంచి సమ్మెలోకి వెళతామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ అన్నారు. గురువారం ఆయన ఇంజనీరింగ్ కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ వాసుబాబుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు 15 సంవత్సరాల నుంచి జీతాలు పెంచకపోగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంజనీరింగ్ కార్మికులకు వర్తించవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అదేవిధంగా టెక్నికల్ వారికి రూ.29,200 జీతాలు ఇవ్వాలని, నాన్ టెక్నికల్ వారికి రూ.24,500 ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ ఆ జీవోలో వర్తింపజేయలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే జీతాలు పెంచకపోతే సమ్మెలోకి వెళతామని తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెక్షన్ అధ్యక్షుడు అక్బర్‌బాషా, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌రెడ్డి, రమణ, కమిటీ సభ్యులు రమణ, వెంకట్రమణ, దర్బార్ పాల్గొన్నారు.

హమాలీల మధ్య ఘర్షణ

- రెండు కాలనీల్లో తీవ్ర ఉద్రిక్తత
- అదనపు బలగాలతో పోలీసు పికెట్‌లు ఏర్పాటు
- మూడు గంటలపాటు పోలీసు స్టేషన్ ముందు హంగామా
- నేడు మార్కెట్‌లో హమాలీలు ప్రవేశించకుండా పోలీసుల చర్యలు



దాడులకు పాల్పడకుండా అడ్డుగా నిలబడిన పోలీసులు

కలికిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులోని టమోట మార్కెట్‌లో హమాలీల మధ్య మొదలైన గొడవ తీవ్ర ఘర్షణగా మారి చివరకు రెండు కాలనీల మధ్య ఉద్రిక్తతకు దారి తీసింది. ఒక వైపు పోలీసులు ఉదయం నుంచి సర్దుబాటు చేస్తుండగా సయోధ్య కుదిరిందని ఊపిరి పీల్చుకున్న తరువాత సాయంత్రం 6 గంటల నుంచి మొత్తం వ్యవహారం రెండు వర్గాల మధ్య దాడులు, ప్రతి దాడులకు సిద్ధమైంది. వివరాలిలా... రెండు కాలనీలకు చెందిన దాదాపు 350 మంది ఏళ్ల తరబడి స్థానిక టమోట మార్కెట్‌లో హమాలీలుగా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం మార్కెట్‌లో టమోటాలను సర్దుబాటు చేసే ప్రయత్నంలో హమాలీ తీసుకొస్తున్న ఒక ఖాళీ బాక్సు జారి మరో హమాలీ కాలి మీద పడింది. దీంతో బాధితునికి ఆ హమాలీ క్షమాపణ చెప్పి తనపనిలో నిమగ్నమయ్యాడు. ఆ తరువాత కొంత సేపటికి బాధిత హమాలీ తరపున నలుగురైదుగురు వచ్చి బాక్సు పడేసిన హమాలీపై దురుసుగా ప్రవర్తించారు. ఇది వాగ్వివాదంతో మొదలై చివరికి ఒకరినొకరు కొట్టుకునే వరకూ వెళ్లింది. ఈ దశలో పలువురు వ్యాపారులు జోక్యం చేసుకుని సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. పరిస్థితి శ్రుతి మించుతున్న సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే మార్కెట్‌కు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. ఇది మళ్లీ పునరావృతం కాకుండా చేసేందుకు తరువాత స్టేషనుకు రావాలని ఇరువర్గాలకు సూచించారు.

ఈ నేపథ్యంలో ఒక వర్గానికి చెందిన దాదాపు రెండు వందల మంది సాయంకాల స్టేషను వద్ద పోగయ్యారు. సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి వారిలో కొందరిని కూర్చోబెట్టి సర్దుబాటు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇది జరుగుతుండగానే మరో వర్గానికి చెందిన ఇంకో హమాలీ మార్కెట్ వైపు నుంచి క్రాస్ రోడ్డు వద్దకు వచ్చి కేకలు వేస్తూ చేతిలో కొడవలి చూపిస్తూ మోటారు సైకిల్‌పై పోలీసుస్టేషను చేరుకున్నాడు. అక్కడ కూడా తిరిగి కొడవలి చూపిస్తూ వీరంగం చేయడంతో అప్పటికే అక్కడున్న మరో వర్గం హమాలీలు రెచ్చిపోయారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కొడవలితో వచ్చిన వ్యక్తిని బంధించి స్టేషన్ లోపలికి తీసుకెళ్లారు. ఈ సంఘటనతో బయట వున్న వందల మంది హమాలీలు రెచ్చిపోయారు. ఇదిలా వుండగానే అంతా ఒక కొలిక్కి వస్తున్నదని, మరో వర్గం హమాలీలను కూడా పిలిపించాలని పోలీసులు ప్రయత్నిస్తుండగానే అక్కడున్న హమాలీలు మోటారు సైకిళ్లు తీసుకుని మరో వర్గం హమాలీలకు చెందిన కాలనీపై దాడికి ప్రయత్నించారు. సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వీరిని వెంబడిస్తూ కాలనీ పైకి పరుగులు తీశారు. మరో వైపు కాలనీ వాసుల్లో మహిళలు, వృద్ధులు, పిల్లలు రోడ్డు పైకి వచ్చి మరో వర్గం హమాలీల దాడులను ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారు. దాడులకు ప్రయత్నించిన హమాలీలను పోలీసులు చెదరగొట్టి తరిమేశారు.

పోలీసు సిబ్బంది బయట ప్రాంతాలకు బందోబస్తు డ్యూటీకి వెళ్లడంతో స్థానిక పోలీసులకు రెండువర్గాల దాడులను అడ్డుకోవడం సమస్యగా మారింది. ఎట్టకేలకు రాత్రి పీలేరు సీఐ యుగంధర్, కేవీపల్లె ఎస్ఐ చిన్నరెడ్డెయ్యలు తమ పోలీసు బలగాలను తీసుకొచ్చి ఉద్రిక్తతను తాత్కాలికంగా తగ్గించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా కేంద్రం నుంచి స్పెషల్ పోలీసులు కూడా కలికిరి చేరుకుంటున్నారు. కాగా ఒక దశలో శుక్రవారం టమోట మార్కెట్‌ను మూసివేయాలని పోలీసులు నిర్ణయించారు. అయితే రైతులు ఇబ్బంది పడతారనే ఆలోచనతో రెండు వర్గాలకు చెందిన హమాలీలను మార్కెట్‌లోకి రాకుండా చర్యలు తీసుకునేందుకు నిర్ణయించారు. ఇరువర్గాల మీద కేసులు నమోదు చేస్తున్నట్లు కలికిరి సీఐ తెలిపారు. కాలనీల పైకి పరస్పర దాడులకు పాల్పడ కుండా అన్ని చోట్ల రాత్రికి పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

వాల్మీకిపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతలవారిపల్లె గ్రామానికి చెందిన కె.బొజ్జమ్మ(80) అనే వృద్ధురాలికి మతిస్థిమితం సరిగా లేదు. ఆమె భర్త, కుమార్తె చాలా రోజుల క్రితం మృతి చెందడంతో ఆమె బాగోగులను అల్లుడు వెంకటరమణ చూసుకుంటున్నాడు. గురువారం ఈయన తన అత్తను ఇంటి వద్దనే వదిలి బంధువుల అంత్యక్రియల నిమిత్తం వేరే ఊరికి వెళ్లాడు. అదే సమయంలో బొజ్జమ్మ చింతలవారిపల్లె గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లి పాకాల నుంచి గుంతకల్లుకు వెళ్తున్న రైలుకింద పడి తీవ్ర గాయాలపాలైంది. ఈ ఘటనను గుర్తించిన స్థానికులు ఆమెను హుటాహుటిన వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందింది. కదిరి రైల్వే ఎస్ఐ రహీం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రైలు ఢీకొని మృతిచెందిన వృద్ధురాలు

రైతు ఆత్మహత్యపై త్రిసభ్య కమిటీ విచారణ



మృతికి గల కారణాలపై విచారణ చేస్తున్న అగ్రికల్చర్ ఏడీ నాగరాజు



తల్లి రాక కోసం ఎదురుచూస్తున్న చిన్నారులు

సిద్దవటం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతు దంపతులు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన తెలిసిందే. కాగా ఈ విషయంపై త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టింది. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని బద్వేల్ అగ్రికల్చర్ ఏడీ నాగరాజు గురు వారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాల విషయమై త్రిసభ్య కమిటీలో డీఎస్పీ, ఆర్డీవో, అగ్రికల్చర్ ఏడీ ముగ్గురు విచారించి నిర్ధారణ చేస్తామన్నారు. రైతు అప్పులు చేసిన ప్రామిసరి నోటీసు, బాండ్లు, పంట పొలాల ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే తగిన న్యాయం చేస్తామన్నారు. వీరి వెంట గ్రామస్థులు, వ్యవసాయశాఖ సిబ్బంది, మండల వీఆర్వో సంటయ్య, వీఆర్ఏ కిషోర్, ఎంపీటీసీ ప్రతినిధి శివశంకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

కాగా మృతుడి తండ్రి మునిరెడ్డి వారితో మాట్లాడుతూ తాము సొంత పొలంతో పాటు మరో ఐదు ఎకరాల్లో పంటలు సాగు చేసేవారమని, పంటల సాగుకు దాదాపు రూ.25 లక్షలు అప్పు చేసినట్లు తెలిపారు. వేరుశనగ, పసుపు, ఉల్లి, పట్టుపరిశ్రమ సాగు, పంటల్లో నష్టం రావడంతో మనస్థాపంతో తన కుమారుడు, కోడలు జూన్ 9న తిరుపతికి వెళుతున్నామని చెప్పి కడప వాచుపల్లె బస్టాండు వద్ద ఓ ఎరువుల దుకాణంలో రసాయనిక మందులు కొనుగోలు చేశారన్నారు. ఈ నెల 10న తిరుపతిలోని లాడ్జీలో పురుగుల మందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లగా వైద్యసేవల నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించామన్నారు. ఈ ఘటనలో కుమారుడు నాగేంద్రరెడ్డి (35) మృతి చెందగా, కోడలు పుష్పవేణి చికిత్స తీసుకుంటోందని తెలిపారు. కాగా మండలంలోని దేగనవారిపల్లె గ్రామంలో స్వగృహం వద్ద మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రి మృతితో పిల్లలు జి.లావణ్య, నాగేంద్ర దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు.

మద్యం లారీ బోల్తా - త్రుటిలో తప్పిన ప్రమాదం

పెనగలూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తపల్లె చెక్‌పోస్టు సమీపంలో గురువారం రాత్రి 8 గంటల సమయంలో మద్యం లారీ బోల్తా పడింది. లారీ నడుపుతున్న డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. లారీలో తీసుకెళుతున్న సరకుకు పెద్దగా నష్టం జరగలేదు. చెక్‌పోస్టు సమీపంలో ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి లారీ బోల్తా పడినట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. ఈ సరుకు చిట్వేలి మండంలోని వైన్‌షాపునకు వెళుతున్నట్లు సమాచారం. విషయం తెలిసిన వెంటనే పెనగలూరు మద్యం షాపుల నిర్వహణ భాగస్థులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అలాగే బెస్తపల్లె సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్న పెనగలూరు పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ కూడా సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

కుట్టు శిక్షణతో ఉపాధి

- జిల్లాలో 24 శిక్షణ కేంద్రాలు
- శిక్షణానంతరం కుట్టుమిషన్లు
- మహిళల ఆర్థిక స్వావలంబనకు చర్యలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళల ఆర్థిక స్వావలంబనకు అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా కుట్టుశిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి దుస్తుల తయారీలో ప్రస్తుతం డిమాండ్‌లో ఉన్న వివిధ రకాల మోడల్ డ్రెస్సులను తయారు చేయడంలో శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 24 శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి శిక్షణ కేంద్రంలో 144 మందికి శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా కుట్టు మిషను ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇందుకు అనుగుణంగా శిక్షణ కేంద్రాల్లో శిక్షణ పొందేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అర్హులైన 15,594 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో తొలివిడతగా 3068 మందికి అవకాశం కల్పించారు. కుట్టు శిక్షణ కేంద్రంలో రోజుకు రెండు పూటలా రెండు బ్యాచ్‌లుగా ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు. శిక్షణకు హాజరైన వారందరికీ డిజిటల్ అటెండెన్స్ ద్వారా హాజరు నమోదు చేస్తున్నారు. ఈ హాజరు 75 శాతం ఉంటేనే ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేసేందుకు అవకాశం ఉంటుంది.



కడప హౌసింగ్‌బోర్డు కాలనీలో శిక్షణ నేర్చుకుంటున్న మహిళలు

వందల మంది కుట్టు శిక్షణ వైపు...

జిల్లాలోని 24 శిక్షణ కేంద్రాల్లో ప్రతిరోజూ వందలాది మంది మహిళలు ప్రభుత్వం అందిస్తున్న కుట్టు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో నూతన మెలకువలతో తయారు చేసిన దుస్తులకు మంచి డిమాండ్ ఉంది. దీంతో ఇంట్లో పనిచేసుకుంటూ కుట్టు మిషన్ల ద్వారా జీవనోపాదులను కల్పించుకోవడానికి అవకాశం ఉంటుందనే ఆలోచనతో చాలా మంది మహిళలు కుట్టుశిక్షణ వైపు దృష్టిసారిస్తున్నారు. ప్రభుత్వం కూడా కేవలం శిక్షణ ఇచ్చి వదిలేయకుండా వారికి కుట్టుమిషన్లు కూడా అందించడం పట్ల మహిళల్లో చాలా మంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.



90 రోజుల పాటు శిక్షణ

జిల్లాలోని అన్ని శిక్షణ కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు మొదలు పెట్టాం. ఈ కార్యక్రమం 90 రోజుల పాటు కొనసాగుతుంది. ఈ శిక్షణలో దాదాపు 70 రోజుల పాటు ఆసక్తకరంగా నేర్చుకున్నవారికి కుట్టుమిషన్లు ఇవ్వనున్నాం. ఈ బ్యాచ్‌లు అయిపో గానే తిరిగి నూతన బ్యాచ్‌లు ఏర్పాటు చేసేందు కు ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

-జయసింహ, ఈడీ, బీసీ కార్పొరేషన్

టైలరింగ్ ద్వారా ఉపాధి



ఉచిత కుట్టు శిక్షణ ద్వారా టైలరింగ్ నేర్చుకుంటు న్నాను. ఈ శిక్షణతో ఉపాధి కలుగుతుందని ఒక నమ్మకం ఏర్పడింది. మహిళల్లో ఆర్థిక అభివృద్ధిని పెంపొందించి బతుకుదెరువుకు భరోసా కల్పిస్తున్న సీఎం చంద్రబాబుకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

-సునంద, ఎర్రగుంట్ల

ఇలాంటి శిక్షణతో జీవనోపాధి



మహిళల్లో ఆదాయ వనరులు పెంపొందించడానికి కుట్టు శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించడం సంతోషకరం. ఈ శిక్షణ వల్ల నాకు నా కుటుంబానికి ఉపాధి దొరుకుతుందనే నమ్మకం ఏర్పడింది. సాటి మహిళలకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది.

-స్వప్న, బెల్లంమండీవీధి, కడప

కడప, నెల్లూరు జట్ల శుభారంభం

- ఏసీఏ సౌత్‌జోన్ రాష్ట్ర స్థాయి టీ20 క్రికెట్ పోటీలు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సీనియర్ టీ20 పోటీల్లో కడప, నెల్లూరు జట్లు శుభారంభం చేశాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)ఆధ్వర్యంలో గురువారం స్థానిక అనంతపురం క్రికెట్ స్టేడియంలో సౌత్‌జోన్ సీనియర్ టీ20 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. తొలుత కడప, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. మొదట బ్యాటింగ్ చేసిన కడప నిర్ణీత 20ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 210పరుగులు చేసింది. వంశీకృష్ణ 61బంతుల్లో 10బౌండరీలు, నాలుగు సిక్సర్లతో 98పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మరో బ్యాటర్ జహీర్ అబ్బాస్ 64పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు 20ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 165పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. కడప బౌలర్లు ఆరీఫ్‌బాషా 3, ధృవకుమార్ రెడ్డి 2వికెట్లు పడగొట్టారు. అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం 19.4ఓవర్లలో 158పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్ అర్జున్ టెండూల్కర్ 78పరుగులతో జిల్లాకు గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. నెల్లూరు బౌలర్ భరత్ 5వికెట్లు పడగొట్టాడు. కడప 18.5ఓవర్లలోనే 3వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. బ్యాటర్ రేవంత్‌రెడ్డి 86పరుగులు, ఫర్మాద్‌ఖాద్రి 56 పరుగులు సాధించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ఏసీఏ సౌత్ జోన్ అండర్-19 మెన్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కడపలో గల వివిధ స్టేడియంలలో ఈనెల 22వ తేదీ నుంచి జూలై 10 వరకు ఏసీఏ సౌత్ జోన్ అండర్-19 మెన్ మల్టీడే (మూడురోజుల మ్యాచ్) క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఈ పోటీల్లో కర్నూలు, నెల్లూరు, కడప, చిత్తూరు, అనంతపురం జట్లు తలపడనున్నాయి. అందులో భాగంగా 22 నుంచి 24 వరకు కర్నూలు - నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. అదే రోజు నుంచి కడప-చిత్తూరు జట్ల మధ్య మరో మ్యాచ్ ఉంటుంది. 25న ఆటకు విశ్రాంతి దినం. అలాగే 26 నుంచి 28 వరకు కడప-కర్నూలు, అనంతపురం - నెల్లూరు, 29న విశ్రాంతి, 30 నుంచి జూలై 2 వరకు అనంతపురం- చిత్తూరు, అదేరోజు కడప- నెల్లూరు, జూలై 3న విశ్రాంతి, 4 నుంచి 6 వరకు చిత్తూరు- నెల్లూరు, అనంతపురం - కర్నూలు, 7న విశ్రాంతి, 8 నుంచి 10 వరకు అనంతపురం- కడప, చిత్తూరు-కడప జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. పై మ్యాచ్‌లన్నీ వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంతో పాటు కేఎస్ఆర్ఎం, కేవోఆర్ఎం క్రికెట్ మైదానాల్లో జరుగుతాయని రెడ్డి ప్రసాద్ తెలిపారు.

22న క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు

వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈనెల 22వ తేదీ ఆదివారం ఉదయం 7-30 గంటలకు అండర్-16, అండర్-14 పురుషుల జిల్లా క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలి పారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికలకు తప్పక హాజరుకావాలని కోరారు. క్రీడాకారులు తమ ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్ (ఫారం-5), పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో ఒరిజినల్‌తో పాటు ఒక సెట్టు జిరాక్స్‌తో హాజరు కావాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరికి గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన నరేంద్రరెడ్డి

పులివెందుల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... లింగాల మండలం అంబకపల్లె గ్రామానికి చెందిన నరేంద్రరెడ్డి (35), కుళాయప్ప అనే వ్యక్తితో కలిసి బైకుపై పులివెందులకు వస్తున్నారు. పులివెందుల నుంచి ముదిగుబ్బ వైపు వెళ్తున్న కారు వీరి బైకును ఢీకొంది. దీంతో నరేంద్రరెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా కుళాయప్ప గాయపడ్డారు. మృతిచెందిన నరేంద్రరెడ్డి పొలం పనులకు సంబంధించి ట్రాక్టర్ డ్రైవర్. ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన దృశ్యం

ప్రొద్దుటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న మాలేపాటి సుదర్శన్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సీవీ సురేంద్ర రెడ్డి తెలిపారు. పట్టణంలోని సాయిబాబా కొట్టాలకు చెందిన సుదర్శన్ గురువారం స్థానిక పొట్టిపాడు రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్లో గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. ఇతని వద్ద నుంచి 1.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సుదర్శన్ నెల్లూరులో ఒక వ్యక్తి నుంచి గంజాయి కొను గో లు చేసేవాడు. వీటిని చిన్న చిన్న పొట్లాలుగా చేసి పట్ట ణంలో విక్రయిస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

గుర్రంకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు నాగార్జున (30) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీ టి.గొల్లపల్లెకు చెందిన గంగులమ్మ కుమార్తె అశ్వినికి కదిరి నియోజకవర్గం గాండ్లపెంటకు చెందిన రమణ కుమారుడు నాగార్జునతో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ క్రమంలో కొంత కాలంగా అతను అత్తగారింటి వద్దనే ఉన్నాడు. చెడు వ్యసనాలకు బానిసకావడంతో భార్య, బంధువులు మందలించారు. మనస్థాపం చెందిన నాగార్జున ఈనెల 16న విషద్రావణం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు రాయచోటి ప్రభుత్వాసుపత్రికి, పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి డీడీగా నీరజ



బాధ్యతలు చేపట్టిన డాక్టర్ నీరజ

మదనపల్లెటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్థకశాఖ మదనపల్లె డివిజన్ ఇన్‌చార్జి డీడీగా డాక్టర్ నీరజ బాధ్యతలు చేపట్టారు. గురువారం స్థానిక డీడీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ వాల్మీకిపురం ఏడీగా పనిచేస్తున్న తాను బదిలీపై మదనపల్లెకు వచ్చానని, ఇక్కడ డీడీగా పనిచేసిన సత్యనారాయణ బదిలీపై వెళ్లడంతో ఇన్‌చార్జి డీడీగా బాధ్యతలు చేపట్టానన్నారు. ప్రభుత్వం పాడి రైతులకు అందించే సంక్షేమ పథకాలను వారికి అందుబాటులో తీసుకెళతానన్నారు. నిరవధికంగా గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉక్కుపాదం : ఎస్పీ



పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

పోరుమామిళ్ల/కలసపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ అశోక్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన పోరుమామిళ్ల, కలసపాడు పోలీస్‌స్టేషన్‌లను తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి... రికార్డులను చెక్ చేశారు. పలు విషయాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాటాడుతూ మహిళలు, యువతులు, విద్యార్థినుల భద్రత కోసం శక్తి టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఈటీంలు కళాశాలలు, బస్టాండ్‌లు, రద్దీ ప్రాంతాల్లో సీక్రెట్‌గా గస్తీ తిరుగుతూ ఉంటారన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో కూడా సీసీ కెమెరాలను త్వరలో ఏర్పాటు చేస్తా మన్నారు. ప్రజలు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినపుడు అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే సీఐ, డీఎస్పీ ఆఫీసులకు వెళ్లవచ్చ న్నారు. ప్రజలకు పోలీసులకు మధ్య గ్యాప్ ఉండకూడదని ఎస్పీ పేర్కొన్నారు. సైబర్ నేరాల పట్ల ఉద్యోగులు, యువత, అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ వల్ల అనేక కుటుంబాలు నాశనమవుతున్నాయని, జిల్లాలో 42 ప్రమాద రహదారుల ప్రాంతాలను గుర్తిం చామని, అక్కడ ప్రత్యేక చర్యలు చేపడుతు న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్, పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు తిమోతి, కొండారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వెబ్‌ల్యాండ్ సవరణలు సత్వరం పూర్తి చేయండి : జేసీ



తహశీల్దార్ కార్యాలయంలో ఫైళ్లను పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్

బి.కొత్తకోట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వెబ్‌ల్యాండ్‌లో సర్వేనెంబర్ల చేర్పులు, సవరణల కోసం రైతులు పెట్టుకునే దరఖాస్తులను సత్వరం పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ తహశీల్దార్‌లను ఆదేశించారు. వెబ్ ల్యాండ్ కరెక్షన్స్ ఫైళ్లను సబ్‌కలెక్టర్ ద్వారా జిల్లా కేంద్రంలో జేసీకి సమర్పిస్తారు. అయితే రాయచోటిలో కాకుండా రెవెన్యూ సిబ్బంది వెసులుబాటు కోసం మదనపల్లెలోనే నిర్వహించాలని నిర్ణయించారు. గురువారం జేసీ హార్సిలీహిల్స్ కు వచ్చిన నేపథ్యంలో మదనపల్లె డివిజన్ పరిధిలోని రామసముద్రం, వాయల్పాడు, కురబలకోట, పీటీయం, ములకలచురువు తదితర మండలాల అధికారులను బి.కొత్తకోటకు రప్పించి తహశీల్దార్ కార్యాలయంలో మండలాల వారీగా ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అన్నదమ్ముల భాగాలు కాకుండా జాయింట్ ఎల్పీయంలో ఉన్న ఇతర భాగస్తుల భూములను రుసుము చెల్లించిన 15 రోజులలోగా పరిష్కరిస్తామన్నారు. కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని కార్డు అవసరమున్న వారు సంబంధిత డాక్యుమెంట్లతో సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మదనపల్లె డివిజన్‌లో ఇప్పటిదాకా 40 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని వాటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి కార్డులను ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో 9మండలాల తహశీల్దార్లు, డీటీలు, సర్వేయర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గండి క్షేత్రంపై ప్రభుత్వ నిర్లక్ష్యం : ఎంపీ



చక్రాయపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన గండి క్షేత్రాన్ని సందర్శించి వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎంతో ప్రసిద్ధిగాంచిన గండి క్షేత్రానికి శ్రావణమాసంలో లక్షల్లో భక్తులు వస్తుంటారన్నారు. ఆలయానికి వైసీపీ ప్రభుత్వంలో రూ.28కోట్లు మంజూరు చేసి 95శాతం పనులు పూర్తి చేశా మన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా మిగిలిన ఐదు శాతం పనులను చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పూర్తయిన ఆలయాన్ని ప్రారంభించి మూల విరాట్ విగ్రహ ప్రతిష్ఠ చేయకపోవడం ఎంత వరకు సమంజసం అన్నారు. ఆయన వెంట పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పెరటికోళ్ల పెంపకం లాభదాయకం



మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త వీరయ్య

సీకేదిన్నె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పెరటికోళ్ల పెంపకం చేపట్టడం ద్వారా రైతులకు లాభదాయకంగా ఉంటుందని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరులో గురువారం పెరటికోళ్ల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, గ్రామీణ రైతులు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పొందిన అనంతరం ఆసక్తితో ఆచరణలోకి తీసుకురావాలని, పెరటికోళ్ల పెంపకం ఆహార భద్రతను కాపాడుతుందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం పశువిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సురేష్‌కుమార్‌రెడ్డి పెరటికోళ్లలో వచ్చే ముఖ్యమైన వ్యాధులు, నివారణ చర్యలు, టీకాల ప్రాముఖ్యత, యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. ఈ సందర్భంగా మహిళా రైతులు కోళ్ల పెంపకాన్ని ఉపాధిగా చూడాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ రైతులకు 500 కోడిపిల్లలను, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కేవీకే శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, సాయిమహేశ్వరి, మహేష్‌బాబు, మానస, దినేష్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

అయినవారే వదిలేసి వెళ్లారు..

- మానవత్వం మంటగలుస్తున్న వేళ...



ఆసుపత్రిలో వదిలేసి వెళ్లడంతో చింతిస్తున్న లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజు రోజుకు మానవ సంబంధాలు దారుణంగా క్షీణిస్తున్నాయి. మానవత్వం మంటగలుపుతున్న సంఘటన ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... నాలుగు రోజుల క్రితం వైఎంఆర్‌కాలనీ అడ్రస్‌తో లక్ష్మీదేవి అనే మహిళను పక్షవాతం సోకిందని వారి కుటుంబీకులు ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. చేర్పించేటప్పుడు ఇచ్చిన అడ్రస్సుతో పాటు సెల్‌ఫోన్ నెంబరు కూడా ఫేక్ ది ఇచ్చారు. దీంతో గత నాలుగు రోజులుగా ఆ మహిళ ఆసుపత్రిలో ఒంటరిగా ఉంటోంది. ఆమెకు పక్షవాతం సోకడంతో సరిగా మాట్లాడలేక పోతోంది. అయితే ఆమెది వైఎంఆర్‌కాలనీ ఏరియా అని మాత్రం చెబుతున్నట్లు ఆసుపత్రి సిబ్బంది చెబుతున్నారు. పక్షవాతం సోకిన ఆమహిళకు కనీసం ఒక అటెండెంట్ లేకుండా వుండటంతో ఆసుపత్రి సిబ్బంది ఆమె కాలకృత్యాలు తీర్చడం లాంటి పనులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఆసుపత్రి సిబ్బంది ఇచ్చిన అడ్రస్సుకు ఫోన్ నెంబరుకు ఫోన్ చేస్తే అవి పనిచేయకపోవడం బట్టి వారు ప్లాన్ ప్రకారం ఆమెను అక్కడ వదిలేసి వెళ్లారని అర్థమౌతోంది. అనారోగ్యంతో వున్న ఆ మహిళ బంధువులు వచ్చి ఆమె బాగోగులు చూసుకోవాలని.. లేకుంటే ఆమె వివరాలు తెలిశాక వారి కుటుంబీకులను విచారించి కేసులు కట్టవలసి వస్తుందని ఔట్‌పోస్టు పోలీసులు హెచ్చరిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు అయినా ముందుకు రావాలని ఆసుపత్రి సిబ్బందితో పాటు ఔట్‌పోస్టు పోలీసులు కోరుతున్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు పరీక్ష

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లోని బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా లయాల సంస్థ జిల్లా కోఆర్డినేటరు ఎ.ఉదయ్‌శ్రీ ఒక ప్రకటన జారీ చేశారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి 6 నుంచి 9 వరకు ప్రవేశాలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్నమయ్య, కడప జిల్లాలోని వివిధ పాఠశాలల్లోని ఆరు నుంచి 9 వతరగతి వరకు మిగిలిపోయిన సీట్లకు మాత్రమే ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. కేవలం ఇంగ్లీషు మీడియం మాత్రమే ఉంటుందని అర్హులైన అభ్యర్థులు ఈనెల 19 నుంచి 23వ తేదీ లోపు సమర్పించాలని తెలిపారు. వివరాలకు సమీపంలోని గురుకుల పాఠశాలలో సంప్రదించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బాలురకు రామాపురం గురుఉకుల పాఠశాలలో, బాలికలకు చిన్నచౌకు గురుకుల పాఠశాలలో ఈ నెల 25న 10గంటల నుంచి 12 వరు ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు.

గండికోట ప్రాజెక్టులో 15 టీఎంసీల నీరు నిల్వ

కొండాపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో ప్రస్తుతం 15.180 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోట ప్రాజెక్టు నుంచి మెయిన్‌కెనాల్‌కు 250 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు.

కరవునేలలో వాణిజ్య సిరులు

- ఉద్యాన రంగానికి ఊతం రాయితీలు
- రూ.2.00 లక్షలకు పెరిగిన రాయితీ
- ఉపాధి ద్వారా ప్రోత్సాహకాలు
- రైతుల బలోపేతంపైనా దృష్టి



కాండ్లమడుగు వద్ద సాగుచేసిన డ్రాగన్ ఫ్రూట్ పంట

బి.కొత్తకోట, జూన్19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ప్రభుత్వం కరువు నేలలోనూ వాణిజ్య సిరులు కురిపిస్తోంది. ఇందుకు రూ. 50 వేలున్న రాయితీని రూ. 2లక్షల వరకు పెంచడమే కారణమని రైతులు ఆనందడోలికల్లో ఉన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు శాపంలా పరిణమించింది. ప్రోత్సాహకాలు, రాయితీలు ఇవ్వలేక చేతులెత్తేయడంతో ఆ శాఖ అధికారులు నామమాత్రంగా మిగిలారు. రైతులను ఉద్యాన పంటలవైపు మళ్లించడంలో విఫలమయ్యారు. ఫలితంగా దీర్ఘకాలిక ప్రయోజనాలందించే ఉద్యానపంటలపై రైతులు ఆసక్తి చూపక సంప్రదాయంగా పండించే టమోటా, మొక్కజొన్న పంటలనే నమ్ముకుని నష్టాల పాలయ్యారు. మామిడి, జామ, డ్రాగన్‌ఫ్రూట్ లాంటి పంటలను సాగుచేసిన రైతులు ఆపన్నహస్తం లేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిస్థితి మారింది. కరువు నేలలో ఉద్యాన సిరులు కురవాలన్న లక్ష్యంతో ఉద్యాన, ఉపాధిహామీ శాఖల ద్వారా కోట్ల రూపాయలను వెచ్చించి అధికారులకు లక్ష్యాలను నిర్దేశించి ఉద్యానరంగానికి ఊతం ఇస్తోంది. వివరాల్లోకెళితే....

అన్నమయ్య జిల్లాలో ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించి మిషన్ ఎండీహెచ్, నరేగా నిధులతో 4వేల హెకార్లకు పైగా విస్తరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం రూ.590 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. సాగుకోసం బిందుసేద్య పరికరాలు, పంట నిల్వల కోసం ప్యాక్‌హౌస్‌లు, సోలార్‌కోల్డ్ స్టోరేజిలు, పాలీహౌస్‌ల నిర్మాణం కోసం రూ.500కోట్లు అవసరమని కోరినట్లు అధికారలు చెబుతున్నారు. మామిడి పంట నాణ్యతను పెంచి విదేశీ మార్కెటింగ్ ద్వారా ఏటా రూ.1700 కోట్ల ఆదాయం వచ్చేలా ప్రణాళిక రచిస్తున్నట్లు తెలుస్తోంది. రూ.10 లక్షలు అవసరమయ్యే పాలీహౌస్‌లను 50శాతం రాయితీతో ఉద్యాన శాఖ ద్వారా ఇస్తుండడంతో రైతులకు పెట్టు బడులు తగ్గడమే కాక, విదేశీ ఎగుమతులకు పనికొచ్చే నాణ్యమైన ఉత్పత్తులు రానున్నాయి.

ఉపాధి ద్వారా ప్రోత్సాహకాలు..

ఉద్యాన పంటల వైపు చిన్న, సన్నకారు రైతులను సైతం మరల్చేందుకు ప్రభుత్వం ఉపాధి ద్వారా నిధులను మళ్లిస్తోంది. గతంలో మామిడికి మాత్రమే పరిమితమైన రాయితీని ఇచ్చేవారు. ప్రస్తుతం 25 రకాల పండ్లతోటల పెంపకానికి విస్తరించింది. పంటను బట్టి ప్రోత్సాహకాలను మూడేళ్లపాటు రైతులకు ఆశాజనకమైన నగదును అందిస్తుండడంతో రైతులు ముందుకొస్తున్నారు. 0.25 ఎకరాల నుంచి 5ఎకరాల వరకు ఉన్న రైతులకు రాయితీలపై అవగాహన కల్పించి, ఆసక్తి ఉన్న రైతులకు ఉపాధి ద్వారా సాయం అందుతుండడంతో ఉద్యానపంటల సాగు ఊపందుకుంది. వైసీపీ ప్రభుత్వంలో రాయితీని హెక్టారుకు నామమాత్రంగా ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఆ రాయితీని రూ.50వేలు నుంచి ఏకంగా రూ.2లక్షల వరకు ఇవ్వనున్నారు.

పండ్ల తోట	లభించే రాయితీ హెక్టారుకు
జామ	రూ. 50,000
నిమ్మ	రూ. 50,000
మామిడి	రూ. 50,000
సపోటా	రూ. 18,000
అరటి	రూ. 70,000
అవకాడో	రూ. 50,000
నేరేడు	రూ. 30,000
డ్రాగన్‌ఫ్రూట్	రూ. 2,00,000

విభిన్నరకాల పంటల సాగు..

జిల్లాలో ఉద్యాన పంటల సాగు క్రమేపీ విస్తరిస్తోంది. మామిడి, సపోటా, దానిమ్మ, నేరేడు, అరటి, డ్రాగన్‌ఫ్రూట్ సహా వక్కతోట, అవకాడో సాగుపై సైతం రైతులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో 300 ఎకరాలకు పైగా డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేశారు. కిలో వంద దాకా అమ్ముడుపోతుండడంతో అధికలాభాలు గడిస్తున్నారు. మామిడి పండ్ల ఎగుమతిపై కలెక్టర్ శ్రీధర్ ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ప్రకటించడం, టమోటాకు ప్రత్యామ్నాయంగా పండ్లు, పూలతోటల సాగుపై దృష్టి పెట్టడంతో రైతుల్లోనూ మార్పు కనిపిస్తోంది. కరువు నేలలోనూ ఉద్యానసిరులు కురిపించే దిశగా కూటమి సర్కార్ పనిచేస్తోంది.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం ఉద్యానపంటల సాగుకు ఇస్తున్న రాయితీలను రైతులు వినియోగించుకోవాలి. లాటరీ లాగా ఎప్పుడో ఒకసారి ధర వచ్చి ఏడాదంతా నష్టాలు మిగిల్చే టమోటాను వదిలి పండ్లు, పూలసాగును మొదలెట్టాలి. ఎన్నడూ చూడని ప్రోత్సాహకాలను కూటమి ప్రభుత్వం అందిస్తోంది. రైతులకు సేవలందించేందుకు సిద్ధంగా వున్నాం

భీమేష్, ఉద్యానశాఖాధికారి







బీరంగి వద్ద రోజాపంటను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి (ఫైల్ ఫోటో) - శీతివారిపల్లె వద్ద ప్రయోగాత్మకంగా వక్కలసాగు - హార్టికల్చర్ పాలీహౌస్‌లో సాగు చేసిన రోజాపంట

పాడి రైతులకు సమస్యలు రాకుండా చూడాలి

ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి



ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డిని కలిసిన వెటర్నరీ అధికారులు

వాల్మీకిపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ఎలాంటి సమస్యలు ఇబ్బందులు తలెత్తకుండా ఎల్ల వేళలా అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల వాల్మీకిపురం, కలికిరి ప్రాంతాలకు చెందిన వెటర్నరీ వైద్యాధికారులు, సిబ్బంది గురువారం నగిరిపల్లెలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాల్మీకిపురం, కలికిరి వెటర్నరీ ఏడీలు విశ్వేశ్వరరెడ్డి, వెంకటమునినాయుడు, డాక్టర్లు సుదీప్, అనూష, సౌజన్య, దీపిక, సునీల్‌నాయక్, సలీం, గిరినాథరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, మునిచంద్రారెడ్డి, సాదిక్‌బాషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ సంస్థాగత ఎన్నికలకు సమాయత్తం'

కలికిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గంలో టీడీపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడానికి ముగ్గురు పరిశీలకులు గురువారం కలికిరి చేరుకున్నారు. ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి స్వగ్రామం నగిరిపల్లెలో ఆయనను కలిసి సంస్థాగత ఎన్నికల ఏర్పాట్లపై చర్చించారు. పరిశీలకులు రాష్ట్ర కార్యదర్శులు సూరా సుధాకర్ రెడ్డి (శ్రీకాళహస్తి), గుమ్మిడిపూడి దశరథాచారి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్ బాబు (కడప) ఈ చర్చల్లో పాల్గొన్నారు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్ రెడ్డి, నేతలు కృష్ణా రెడ్డి, కలికిరి, పీలేరు మండల టీడీపీ అధ్యక్షులు నిజాముద్దీన్, శ్రీకాంత్ రెడ్డి, పీలేరు మాజీ జడ్పీటీసీ రెడ్డిబాషా పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే నీటి సంరక్షణ పనులు



రైతులతో మాట్లాడుతున్న వాటర్ షెడ్ పీఓ

పెద్దతిప్పసముద్రం జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజల భాగస్వామ్యంతోనే నీటి సంరక్షణ పనులను చేపట్టాలని జిల్లా నీటి యాజమాన్యసంస్థ (డ్వామా) ప్రాజెక్టు ఆఫీసర్ (పీఓ) ఎస్. ఖాజామైనుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం సంపతికోట వాటర్ షెడ్ ప్రాజెక్టు పరిధిలోని రంగసముద్రం సచివాలయంలో వాటర్ షెడ్ కమిటీ చైర్మెన్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో పీఓ మాట్లాడుతూ వాటర్ షెడ్ పనులు అర్హత కలిగిన రైతులు సద్వినియోగం చేసుకుంటే భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటాయన్నారు. రంగసముద్రం పరిధిలో వాటర్‌షెడ్ పనులకు ప్రభుత్వం రూ. 2 కోట్లు నిధులను మంజూరు చేసిందని, రైతులు దీనిని దృష్టిలో ఉంచుకుని అర్హత కలిగిన రైతులు పనులను వినియోగించుకుంటే రైతులకు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివకుమార్, టెక్నికల్ ఆఫీసర్ ఎస్. దీపక్‌కుమార్, టీఓ (ఐసీటీ) మేఘనాధం తదితరులు పాల్గొన్నారు.

పైపులతో తాగునీటి పైప్‌లైన్

- శశిధర్‌రెడ్డిపై ఆగ్రహించిన ఏఈ



నాణ్యమైన పైపులు వేస్తున్న దృశ్యం

నిమ్మనపల్లి, జూన్ 19(ఆంధ్ర జ్యోతి): నాసిరకం పైపులు వేసి బిల్లు చేసుకునేందుకు యత్నించిన సర్పంచ్ వరలక్ష్మి భర్త శశిధర్‌రెడ్డిపై ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మిథున్ చక్రవర్తి ఆగ్రహించారు. మిట్టమీద వారిపల్లిలో తాగునీటి సమస్య రావడంతో కొత్తగా పైప్‌లైన్ ఏర్పాటుకు ఏఈ అనుమతులు ఇచ్చారు. కాగా శశిధర్‌రెడ్డి పైప్‌లైన్ ఏర్పాటులో రైతులకు సబ్సిడీపై ఇచ్చిన పైపులను వేసి బిల్లు చేసుకునేందుకు చూశారు. అయితే 'తాగునీటికి సబ్సిడీ పైపులు' అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమవడంతో ఏఈ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పైప్‌లైన్ పరిశీలించారు. తన సిబ్బందితో కాల్వలో వేసిన సబ్సిడీ పైపులను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో నాణ్యమైన పైపులను తెప్పించి పైప్‌లైన్ పూర్తి చేశారు. ఏఈ మాట్లాడుతూ తాగునీటికి నాణ్యమైన పైపులు వాడాలని చెప్పినట్లు తెలిపారు. డ్రేనేజీ కూడా తన అనుమతి లేదని వున్న చోటే మళ్ళీ ఎలా నిర్మిస్తారని నిలదీశారు.

విద్యార్థుల సంఖ్యపెంచాలి

పెద్దమండ్యం, జూన్ 19(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఎంఈఓ మనోహర్ పిలుపు నిచ్చారు. గురువారం కలిచెర్ల తెలుగు హైస్కూల్ తనిఖీ చేశారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. కొత్త విద్యార్థులకు సరళమైన పద్ధతిలో పాఠ్యాంశాలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ మాట్లాడుతూ గుర్రంవాండ్లపల్లికు హైస్కూల్ మంజూరైందని, ఆ ప్రాంత విద్యార్థులకు అనువుగా ఉంటుందన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధ్యాయులు తల్లికి వందనం, సర్వేపల్లి రాధకృష్ణ విద్యా కిట్లపై అవగాహన కల్పంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యకు కేరాఫ్ ప్రభుత్వ బడులు

పీలేరు రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యకు ప్రభుత్వ పాఠశాలలు కేరాఫ్‌గా నిలిచాయని పీలేరు ఎంఈఓ-2 పద్మావతి, మెయిన్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సురేంద్రనాథరెడ్డి తెలిపారు. పీలేరు మెయిన్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుక్స్, ఇతర విద్యాసామగ్రి పంపిణీ చేసిన వారు మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు వాస్తవ పరిస్థితులను గుర్తించి ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని సూచించారు. గురువారం ఒకే రోజు పీలేరు మెయిన్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో 35 మంది విద్యార్థులు చేరడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని రాజేశ్వరమ్మ, ఉపాధ్యాయులు శెట్టి సుబ్రహ్మణ్యం, చాముండేశ్వరి, మంజుల, వెంకట్రమణ, అరరుణ, సీఆర్‌పీ మురళీధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు విద్యామిత్ర కిట్ల పంపిణీ

వాల్మీకిపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, దుస్తులు, షూస్, తదితర స్టేషనరి అందజేస్తూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇస్తున్న సూపర్ సిక్స్ హామీలు పూర్తి స్థాయిలో నెరవేర్చే దిశగా చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు వెంకటరత్నం, వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి, స్కూల్ కమిటీ చైర్మన్ సుబ్రహ్మణ్యం, నాయకులు గాంధీపేట రమణ, మురళి, గోవిందు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీఎల్ వెంకటేశ్

పీలేరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని సీపీఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జిల్లా సమగ్రాభివృద్ధిపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఏర్పడి నాలుగేళ్లవుతున్నా జిల్లాలో సహజ వనరులు సమృద్ధిగా ఉన్నా ఇంత వరకు జిల్లా అభివృద్ధి శూన్యమన్నారు. ఇసుక అక్రమార్కుల ధనదాహానికి అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి ఏళ్లు గడుస్తున్నా పునర్నిర్మాణంపై స్పష్టత కరువైందన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా జిల్లా గూండా సాగే రాయలసీమ రైతాంగానికి వరదాయిని వంటి కడప-బెంగళూరు రైల్వేలైను కూడా అటకెక్కిందన్నారు. పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడంతో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పించే పరిశ్రమలు ఏమీ సాధించలేకపోయారన్నారు. హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి సాగు, తాగునీరు అందించాలన్నారు. మదనపల్లెలో చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ నిర్మాణం పూర్తి చేసి మదనపల్లె ప్రజలను ఆదుకోవాలన్నారు. కాంగ్రెస్ నేత దుబ్బా శ్రీకాంత్, ఏఐటీయూసీ నేతలు శ్రీను, రమణ, ఏఐఎస్ఎఫ్ నేత వినోద్, హమాలీ వర్కర్స్ యూనియన్ నేతలు పీవీ రమణ, దాము, మురళీ పాల్గొన్నారు

యువతకు మార్గదర్శి రాహుల్

పీలేరు రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలతో మమేకమై వాటి పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న నేత రాహుల్ గాంధీ అని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్ తేజ తెలిపారు. గురువారం పీలేరులో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అన్నదానం చేశారు. కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు సాయిసంపత్ కుమార్, నేతలు అఖిల్, ముని, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కువైట్ బాధితురాలి కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా

కలికిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కువైట్‌లో అష్టకష్టాలు పడి మంత్రి నారా లోకేష్ జోక్యంతో స్వగ్రామం చేరుకున్న పుష్ప కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా లభించింది. కురవపల్లెకు చెందిన కూచిగాళ్ళ పుష్ప జీవనోపాధి నిమిత్తం కువైట్ వెళ్ళి ఏజెంట్ చేసిన మోసం కారణంగా చిక్కుల్లో పడింది. దీంతో తనను స్వదేశం రప్పించాలని కోరుతూ మంత్రి లోకేష్‌కు వీడియోద్వారా మొరపెట్టుకోవడం, ఆంధ్రజ్యోతి కూడా పుష్ప దయనీయ స్థితిని వెల్లడించడంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ స్పందించి ఆదివారం ఆమెను ఇండియాకు రప్పించిన విషయం తెలిసిందే. స్వగ్రామం చేరుకున్న పుష్ప తన పిల్లలు, తండ్రి కృష్ణయ్యతో కలిసి ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి వద్దకు చేరుకుని తన కష్ట సుఖాలను వివరించింది. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పుష్ప పిల్లల చదువు బాధ్యతలకు భరోసా కల్పించారు. కుమార్తె పూజకు గురుకుల కాలేజీలో ఇంటర్‌లో సీటుకు ఏర్పాటు చేశారు. గ్యారంపల్లె మాజీ సర్పంచు వెంకట్రమణా రెడ్డి పుష్ప కుటుంబాన్ని ఎమ్మెల్యే వద్దకు తీసుకొచ్చి సాయపడ్డారు.

నాటుసారా ఊట ధ్వంసం - వ్యక్తి అరెస్టు

మదనపల్లె టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కురబలకోట మండలంలో బీఎంపీపీ పోలీసులు నిర్వహించిన దాడుల్లో నాటుసారా తయారీకి సిద్ధం చేసిన ఊట ధ్వంసం చేసి ఒకరిని అరెస్టు చేశారు. గురువారం ఎక్సైజ్‌శాఖ బీఎంపీపీ సీఐ సత్యశ్రీనివాస్ ఆధ్వర్యంలో పెద్దబోడుగుట్ట అటవీప్రాంతంలో తనిఖీ చేపట్టారు. అక్కడ 200 లీటర్ల సారాఊట కనుగొని ధ్వంసం చేశారు. ఇందులో ఎ.రఘుపతినాయుడును అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు.

నేడు ప్రభుత్వ పెన్షనర్ల అత్యవసర సమావేశం

పీలేరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలు చర్చించడానికి శుక్రవారం పీలేరులో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ పెన్షనర్ల సంఘం పీలేరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రారెడ్డి, ఎర్రమరాజు ప్రకటించారు. పెన్షనర్లకు పీఆర్‌సీ, డీఏల అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న కొన్ని నిర్ణయాలతో పెన్షనర్ల జీవితం అగమ్యగోచరంగా తయారవుతోందని వారు వాపోయారు. ఆ అంశాలపై చర్చించి సుప్రీంకోర్టును ఆశ్రయించకపోతే పెన్షనర్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. అందు కోసం పీలేరు పాత బస్టాండులోని తమ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే సమావేశంలో పెన్షనర్లందరూ విధిగా హాజరు కావాలని వారు కోరారు.

ప్రజలకు సకాలంలో సేవలు అందించాలి



సచివాలయంలో సూచనలిస్తున్న లక్ష్మీపతి

మదనపల్లె టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి ఆదేశించారు. గురువారం వెంకప్పకోట సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, క్షేత్రస్థాయిలో విధులకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేసి వెళ్లాలన్నారు. ఈనెల 21న యోగాంధ్ర కార్యక్రమాలను ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో తప్పక నిర్వహించాలని సూచించారు. ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ పాల్గొన్నారు.

ఏడాదిలోనే జనసేన వందశాతం సక్సెస్

మదనపల్లె, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జనసేన నేత పవన్‌కల్యాణ్ ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఏడాదిలో వందశాతం విజయం సాధించారని ఆపార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ నేత చేయని విధంగా రూ.9.60కోట్లు కష్టార్జితాన్ని ప్రజలకు సాయం చేసిన గొప్పనేతని కొనియాడారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా కేంద్రం నుంచి వచ్చే నిధులను నేరుగా పంచాయతీలకు అందించి పారదర్శకంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. అటవీశాఖ మంత్రిగా చొరవ చూపి కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను మన రాష్ట్రానికి తీసుకొచ్చి, అరుదైన రికార్డు సాధించారన్నారు. అడ్వొకేట్ అమర నారాయణ, ఎస్.హరినాథ్, మాలతి, రమేష్, సందీప్‌రెడ్డి, రమణారెడ్డి, నరేష్, మనోజ్ పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో బలోపేతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న దానియల్ మాదిగ

కలకడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో ఎంఆర్పీఎస్ నూతన కార్యవర్గాన్ని బలోపేతం చేద్దామని జిల్లా ఇన్‌చార్జి దానియల్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం కలికిరి, కలకడ, గుర్రంకొండ మండలాల నేతల సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఉద్యమం ప్రారంభమై 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో అధినేత మందకృష్ణ మాదిగ సారథ్యంలో వర్గీకరణ సాధించడం గర్వకారమణన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల గ్రామ, మండల స్థాయిలో ఇన్‌చార్జిలను నియమించి నియామకాలను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో గండికోట వెంకటేశు, ముల్లంగి రెడ్డెప్ప, శ్రీనివాసులు, వెంకటరమణ, హరినాథ్, రెడ్డెయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ ఎల్పీఎంల నుంచి విముక్తి కోసం రైతులకు మరో అవకాశం

కలికిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో చాలా భూములు పలువురు రైతుల పేరుతో జాయింట్ ఎల్పీఎంలుగా ఒకే నంబరుతో వున్న వాటిని విడగొట్టుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ మేరకు జిల్లా అధికారులు కూడా గురువారం రైతులకు పలు రకాల విజ్ఞప్తులు పంపారు. ఈ నెల 30 లోగా జాయింట్ పట్టాదారులు ఎవరి భూములను వారి పేరుతో విడగొట్టుకుని వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసుకోవడానికి అవకాశమిచ్చారు. ఇప్పటి వరకూ ఒక సర్వే నంబరుకు రూ.500 వంతున చెల్లించి సర్వే కోసం చేయించుకునేవారు. అయితే ఈ ప్రత్యేక అవకాశం ద్వారా కేవలం రూ.50 చెల్లించి ఆయా సచివాలయాల ద్వారా జాయింట్ పట్టాలను విడగొట్టేందుకు సర్వే అధికారులు సిద్ధంగా వున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే జాయింట్ సర్వే నంబర్లలోని భూములున్న కారణంతో తల్లికి వందనం లబ్ధికి దూరమయ్యారని, జాయింట్ నంబరులో పలువురు రైతులకు కలిపి 11 ఎకరాలుంటే ప్రతి రైతు పేరుతోనూ 11 ఎకరాలు వెబ్ ల్యాండ్‌లో చూపిస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ కూడా ఈ రైతులకు అందే పరిస్థితి లేదని వివరించారు. ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలైన రేషన్ కార్డుకు కూడా అనర్హులవుతారని హెచ్చరించారు. సంక్షేమ పథకాలకు జాయింట్ పట్టాలు అడ్డంకిగా వున్నాయని, అందువల్ల ఈ కోవకు చెందిన వారందరికీ తక్షణం జాయింట్ పట్టాను విడగొట్టి ఎవరి భూమిని వారికి నమోదు చేయిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

వేడుకగా బోయకొండ గంగమ్మ జాతర

నిమ్మనపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): యర్రప్పగారిపల్లిలో బోయకొండ గంగమ్మ, మారెమ్మ, నల్లవీర గంగమ్మ జాతర్లు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు, భాజాభంత్రీల నడుమ మహిళలు దీలు బోనాలు మోశారు. రాత్రి కోలాటాలు, చెక్కభజనలు, పిల్లలగ్రోవి వంటి నృత్యాలు ఆక ట్టుకున్నాయి. అనంతరం అమ్మవార్లకు తెల్లవారు జామున పొట్టేళ్లను ఆగారం ఇచ్చి పండుగను వేడుకగా చేసుకున్నారు. గ్రామాల్లో గంగజాతర్లు జరుగుతుండడంతో బంధుమిత్రులు, స్నేహితుల రాకపోకలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

వ్యవసాయ అధికారిగా జాఫర్



రామసముద్రం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా ఎస్.జాఫర్ నియమించ బడ్డారు. గతంలో ఇక్కడ వ్యవసాయాధికారిగా పని చేసిన మోహన్‌కుమార్ చౌడేపల్లెకి బదిలీ కావడంతో అనంతపురం జిల్లా కంబదురు మండలం నుంచి రామసముద్రం మండలానికి బదిలీపై వచ్చారు. జాఫర్ మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉంటూ మండల వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడతానని తెలిపారు.

గుర్రంకొండ పరిశీలకుడిగా గుత్తికొండ త్యాగరాజు



ములకలచెరువు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గం గుర్రంకొండ మండల టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడి గా టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం నుంచి ఉత్తర్వులు వచ్చాయని తెలిపిన ఆయన మాట్లాడుతూ గుర్రంకొండ మండలంలో టీడీపీని మరింత బలోపేతం చేసి సంస్థాగత ఎన్నికలను కట్టుదిట్టంగా నిర్వహిస్తా మన్నారు. అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ యోగాంధ్రలో పాల్గొనాలి

కలకడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పొల్గొని విజయవంతం చేయాలని ఎంఈఓ మునీంద్రనాయక్ సూచించారు. గురువారం బాటవారిపల్లె పంచాయతీలో గరుడప్పగారిపల్లె, పోతువారిపల్లె, కేమాదిగ పల్లెలో యోగాసనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన నిత్యజీవితంలో యోగా ప్రాముఖ్యత, కలిగే ఆరోగ్య ప్రయోజనాలను గ్రామస్థులకు వివరించారు. కార్యదర్శి ఉదయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ ఒకరికి గాయాలు



పీలేరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మిన్నంరెడ్డిగారి పల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు విజయ్, గణేశ్, నాగచైతన్య ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో 6వ తరగతికి చెందిన నాగచైతన్యకు ఎడమ కంటి వద్ద గాయమవడంతో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దాదాపు 60 మంది విద్యార్థులు, 8 మంది ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ పట్ల ఉపాధ్యాయులు స్పందించక పోవడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు.